

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

అమరావతి | సంపుటి: 2 • సంచిక: 31 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | సోమవారం • 1-1-2018 | www.manamnews.com | /manamnews



సంక్రాంతి ముందే నవక్రాంతి

- జన్మభూమి-మాఊరు ఉత్సవాలు
- రాష్ట్రంలో 10 రోజులు పండుగలు
- ఎక్కడున్నా సొంత ఊరికి రండి
- మీ నేల రుణం తీర్చుకోండి: సీఎం



జనసేన సభ్యత్వం ప్రారంభం

- స్వీకరించిన పవన్ కల్యాణ్
- త్వరలో 2 రాష్ట్రాల్లో నమోదు

వివరాలు 2లో..

ట్రెక్కింగ్‌లో తప్పిపోయిన విద్యార్థులు


నేవీ హెలికాప్టర్‌తో ఆచూకీ లభ్యం

..వచ్చేస్తున్నా

రాజకీయ పార్టీ పెడుతున్నా.. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ



తలైవర్... తన పేరు నిలబెట్టుకుంటున్నాడు. పాపారాయుడు మరోసారి కండువా ఎగరేశాడు. నరసింహ గర్జించాడు. బాషా ఒకసారి చెబితే వందసార్లు చెప్పినట్లేనంటూ అభిమానుల సాక్షిగా తన నిర్ణయాన్ని ప్రకటించాడు. సుల్తాన్ ద వారియర్ అంటూ తమిళనాట కొదమ సింహాల్లాంటి ద్రవిడ పార్టీలతో పోరాటానికి సై అన్నాడు. అశేష అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మాట ఎట్టకేలకు బయటకు వచ్చింది..



• దేవుడు శాసించాడు

రాష్ట్రాన్ని చూసి నవ్వుతున్నారు

5లో..



కొత్త సంవత్సరమంటే క్యాలెండర్ మాత్రమే మారుతుందిరా.. మన జీవితాలింతే..!

కొత్త జోరు

కొత్త సంవత్సరం 'నేనొస్తున్నా'నంటూ చిరునవ్వుతో ద్వారంలో నుంచి తొలి అడుగేయగానే జనోత్సాహం ఉవ్వెత్తున ఎగసింది. విశ్వవ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటగా తారాజువ్వల వెలుగులతో పోటీపడుతూ జన హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. ''నిన్నటి అనుభవాల నుంచి నేర్చుకోండి... నేటి జీవితాన్ని ఆనందించండి... రేపటి ఆశలతో ముందుకేగండి'' అన్న పెద్దల మాట సరికొత్త 365 పుటల పుస్తకం తొలిపేజీలో దర్శనమిచ్చింది.



వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో సోమవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు.. రాత్రిపూట చలి తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 30 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 53 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి ఉ.11.45 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: మృగశిర మ.2.51 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.10.10-11.34; దుర్ముహూర్తం: ఉ.11.58-12.42, మ.2.53-3.37; రాహుకాలం: ఉ.8.12-9.35; అమృతఘడియలు: ఉ.7.11-8.36; శుభసమయం: ఉ.6.00-7.00.

సూర్యోదయం: 6.50

సూర్యాస్తమయం: 5.49



శాంతిభద్రతలే ప్రధానం

నండూరి స్ఫూర్తితో ముందుకెళ్తా: డీజీపీ మాలకొండయ్య

- సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు
- సాంబశివరావుకు ఘనంగా వీడ్కోలు
- నేను పదవికే అలంకారం: నండూరి

విజయవాడ, డిసెంబరు 31 (మనం న్యూస్ బ్యూరో):

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్ద పీట వేస్తానని డీజీపీ మాలకొండయ్య చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కొత్త డీజీపీగా ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీసీ ఎండీగా ఉన్న ఆయనను డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు మిగతా 5లో..



ప్రధాని పదవిపై ఆశలేదు

2020లో రాజకీయాలకు గుడ్‌బై

- సమాజ సేవ చేసుకుంటాను
- మొరార్జీ దేశాయ్ నాకు ఆదర్శం
- ఫిరాయింపులపై 3 నెలల్లో చర్యలు
- కులాల గురించి ఆలోచించరాదు
- వ్యవ'సాయం'పై దృష్టి పెట్టాలి
- ప్రోటోకాల్‌తో ఇబ్బందే: వెంకయ్య



అమరావతి, డిసెంబరు 31 (మనం ప్రతినిధి):

ప్రధానమంత్రి కావాలన్న కోరిక తనకు లేదని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. జనవరి 12, 2020 నాటికి రాజకీయాల నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. ఆదివారం ఆయన అమరావతిలో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ''రాజకీయాలకు గుడ్ బై మిగతా 5లో..

S & D

సంక్రాంతికి ముందే నవక్రాంతి

రేపటి నుంచి 'జన్మభూమి-మాఊరు' ఉత్సవాలు.. రాష్ట్రంలో 10 రోజులు పండుగ

- ఎక్కడున్నా సొంత గ్రామానికి రండి
- పుట్టిన నేల రుణం తీర్చుకోండి: సీఎం
- నూతన సంవత్సర శుభాకాంక్షలు



అమరావతి, డిసెంబరు 31 (మనం ప్రతినిధి): సంక్రాంతి పండుగకు ముందే 'జన్మభూమి-మాఊరు' పేరుతో నవక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పండుగకు 10 రోజుల ముందే రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో క్రీడా సంబరాలకు నాంది పలుకుతున్నామని చెప్పారు. సంక్రాతికి మూడు రోజులు సంబరాలైతే.. జన్మభూమి-మాఊరు కార్యక్రమం పేరుతో ప్రభుత్వం 2వ తేదీ నుంచి 10 రోజులు పండుగలను నిర్వహిస్తోందన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన తెలుగు ప్రజలు ఎక్కడెక్క డున్నా స్వగ్రామానికి తరలి వచ్చి ఈనెల 2వ తేదీ ప్రారంభం కానున్న జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలు నూతన సంకల్పాన్ని తీసుకోవాలని సూచించారు. పుట్టిన నేల రుణం తీర్చుకోవాలని, పల్లెల్లో నవక్రాంతులు నింపాలని విజ్ఞప్తి చేశారు. 16 వేల కోట్ల ద్రవ్యలోటుతో 42 నెలల క్రితం నవ్యాంధ్ర ప్రయాణం ప్రారంభమైందని, దశాబ్దాలుగా నినాదంగా మోగిన నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా నిరూపించామని చంద్రబాబు అన్నారు. కృష్ణానది ఎగువ ప్రాజెక్టుల నుంచి చుక్కనీరు రాని తరుణంలో పట్టిసీమ ద్వారా గోదావరి నదీ జలాలను ప్రకాశం బ్యారేజీకి తీసుకువచ్చామన్నారు. మూడేళ్లుగా పట్టిసీమ గోదావరి జలాలతో కృష్ణాడెల్టాలో 18 వేల కోట్ల విలువైన పంట రైతుల ఇంటికి చేరిందని, గోదావరి సారవంతమైన నీటితో కృష్ణా డెల్టా రైతులు అధిక దిగుబడులు సాధించారని చెప్పారు. రైతాంగం కళ్లలో ఆనందాన్ని చూసి, ఇటీవల ప్రకాశం బ్యారేజీ 60 ఏళ్ల ఉత్స వాల్లో పాల్గొన్నందుకు తానెంతో గర్వించానని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతర శ్రమతో, పటిష్ట వ్యూహంతో ముందుకు సాగుతున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగు వారందరికీ 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయానికి చిరునామాగా ఏపీ

- ఖర్చులు తక్కువ, దిగుబడులు ఎక్కువ
- సేంద్రీయ ఆహారంతో ఆయుష్షు పెంపు
- పాలేకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి: బాబు

గుంటూరు, డిసెంబరు 31 (మనం ప్రతినిధి): రసాయన ఎరువుల వాడకం పెరిగిన దృష్ట్యా, ప్రకృతి వ్యవసాయానికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఆదివారం నాగార్జున యూని వర్సిటీ ఎదుట బైబిల్ మిషన్ ప్రాంగణంలో వ్యవసాయ శాస్త్ర వేత్త సుభాష్ పాలేకర్ నేతృత్వంలో ''ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ'' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం జనవరి 8వ తేదీ వరకు కొనసాగుతుంది. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 2018 సంవత్సరాన్ని ఆంధ్రప్ర దేశ్‌కు ప్రకృతి సేద్య సంవత్సరంగా నామకరణం చేస్తున్నా మని ప్రకటించారు. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలన్నారు. మన శరీరం బాగుంటే ఏపనినైనా సునాయాసంగా చేయొచ్చని, అలానే భూమి కూడా శక్తిమంతంగా ఉంటేనే ఏ పంటనైనా పండించ వచ్చన్నారు. సుభాష్ పాలేకర్‌ను ఆశాజ్యోతి, వెలుగురేఖగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. మరికొన్ని సంవత్సరాల్లో ప్రకృతి వ్యవసాయానికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాల న్నారు. 1,50,000 ఎకరాల్లో పైసా పెట్టుబడి లేకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ''నేడు వైద్యానికి చాలా మంది ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తున్నారు. సేంద్రీయ ఆహారంతో ఆయుష్షు పెరుగుతుంది. ప్రకృతి వ్యవసాయానికి ప్రపంచమంతటా డిమాండ్ ఉంది. పెట్టు బడులు తగ్గాలంటే ప్రకృతి వ్యవసాయం మినహా మరో మార్గం లేదు. రాష్ట్రాన్ని పూర్తిగా ప్రకృతి వ్యవసాయంగా మార్చడమే లక్ష్యం'' అని చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.



జనసేన సభ్యత్వం ప్రారంభం

- స్వీకరించిన పవన్ కల్యాణ్
- త్వరలో రెండు రాష్ట్రాల్లో నమోదు

హైదరాబాద్, డిసెంబరు 31 (మనం న్యూస్): జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రారంభించారు. ఆదివారం హైదరాబాద్‌లోని జనసేన పరిపాలన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పవన్ తొలి సభ్యత్వం స్వీకరించారు. కొంతమంది ముఖ్యనేతలకు ఆయన సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. త్వరలోనే రెండు రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. పవన్ తన అభిమానులు, పార్టీ కార్యకర్తలతో గత మూడు రోజులుగా భేటీ అవుతున్నారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించినట్లు జనసేన పార్టీ మీడియా హెడ్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వక్తలు, కంటెంట్ రైటర్లు, విశ్లేషకులు, సమన్వయకర్తలుగా పనిచేయడానికి ముందుకొచ్చిన వారికి జనవరి నుంచి హైదరాబాద్‌లో శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు హరిప్రసాద్ వెల్లడించారు. ముందుగా మహిళలు, సీనియర్ సిటిజన్లకు ఈ నెల తొలి లేదా రెండో వారంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

నేటి నుంచి చంద్రన్న సంక్రాంతి కానుక

- జన్మభూమిలో 2 లక్షల కొత్త కార్డులు
- వీటికీ ఉచిత సరుకులు పంపిణీ

అమరావతి, డిసెంబరు 31 (మనం ప్రతినిధి): సంక్రాంతి పండ గను పురస్కరించుకుని రేషన్ కార్డుదారులకు అందించే 'చంద్రన్న సంక్రాంతి కానుక' పంపిణీ సోమవారం ప్రారంభం కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 43 లక్షల మందికి ఈ కానుక పంపిణీ చేస్తారు. ఈ నెల 15 వరకు రేషన్ దుకాణాల్లో ఈ కానుకలను అందజేస్తారు. చంద్రన్న కానుకలో గోధుమపిండి కిలో, పామాయిల్ అరలీటర్, బెల్లం అరకిలో, కందిపప్పు అరకిలో, శనగపప్పు అరకిలో, వందగ్రాముల నెయ్యి, చేతి సంచిలో పెట్టి ఆరు నిత్యావసర సరుకులను అందజేస్తారు. క్రిస్మస్ పండగ సందర్భంగా ఇప్పటికే దాదాపు 30శాతం మందికి కానుకను అందజేశారు. జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో రాష్ట్రంలో కొత్తగా సుమారు 2 లక్షల రేషన్ కార్డులు జారీచేయాలని ప్రభుత్వం నిర్ణ యించింది. ఈ రేషన్ కార్డులకు చంద్రన్న సంక్రాంతి కానుక ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. చంద్రన్న కానుకను చిలకలూరిపేటలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారు.

బెజవాడలో బుక్ ఫెస్టివల్

- నేడు ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి, సీఎం

విజయవాడ, డిసెంబరు 31 (మనం ప్రతినిధి): బుక్ ఫెస్టివల్‌కు విజయవాడ సర్వం సిద్ధమైంది. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం 29వ బుక్ ఫెస్టివల్‌ను ప్రారంభించనున్నారు. 11 రోజుల పాటు జరగనున్న ఈ ఫెస్టివల్‌లో దేశ వ్యాప్తంగా దాదాపు 198 ప్రచురణ కర్తలు, నిర్వాహకులు పాల్గొననున్నారు. 300 స్టాల్స్‌లో పుస్తక ప్రదర్శన చేయనున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ కూడా ఇందులో పాలుపంచుకోంటోంది. విజయవాడతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బుక్ ఫెస్టివల్‌ను ఈ ఏడాది ప్రారంభించనున్నారు. నిరుడు విజయవాడతో పాటు ఆరు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ ఏడాది బుక్ ఫెస్టివల్ నిర్వహణకు ప్రభుత్వం నుంచి రూ. 2కోట్లు సహకారం అందనుంది. బుక్ ఫెస్టివల్ జరిగే 11 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

దశల వారీగా ప్రభుత్వ భవనాలు

- జిల్లా కేంద్రాలలో ఆర్థిక శాఖ కార్యాలయాలు
- 66 సబ్ ట్రెజరీ ఆఫీసుల నిర్మాణం: యనమల



కాకినాడ, డిసెంబరు 31 (మనం బ్యూరో): ఆర్థిక సంస్కర ణలలో భాగంగా రాష్ట్రంలో దశల వారీగా ప్రభుత్వ భవనాలను నిర్మించనున్నట్టు మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. 80 కోట్లతో జిల్లా కేంద్రాలలో ఆర్థిక శాఖ కార్యాలయ భవన సముదాయాలను, అలాగే 66 సబ్ ట్రెజరీ కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం కాకినాడ కోర్టు కాంపౌండు సమీపంలో 10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆర్థిక శాఖ కార్యాలయ భవన సముదాయానికి శంఖుస్థాపన చేశారు. ఏడాదిలో నిర్మాణాన్ని పూర్తి చేయాల న్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో ఆర్థిక శాఖ కార్యాలయాలకు సొంత భవనాలు లేవని, అద్దె భవనాలలో కొనసాగించడం వల్ల ఆర్థికంగా భార మవుతుందని అన్నారు.

జిల్లా కేంద్రాలలో ఆర్థిక శాఖ కార్యాలయాలను ఒకేచోట ఏర్పాటు చేయడం వల్ల ఆర్థిక పరమైన లావాదేవీలు సులభతరం అవుతాయని యనమల చెప్పారు.

చినరాజప్ప న్యూఇయర్ శుభాకాంక్షలు

అమరావతి, డిసెంబరు 31 (మనం ప్రతినిధి): కొత్త సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషంతో జీవించా లని కోరుకుంటున్నాని ఉపముఖ్యమంత్రి, హోం మంత్రి చినరాజప్ప అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. దేశవిదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు రాష్ట్రాభివృద్ధికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఏడాదిలో కొత్త ఆవిష్కరణలకు నాందిపలకాలని అన్నారు. 2017 మాదిరిగానే కొత్త సంవత్సరంలో కూడా శాంతి భద్రతలకు ప్రాధాన్యమిస్తూ నేరరహిత రాష్ట్రంగా ఏపీని దేశంలో తొలిస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. చంద్రబాబు చేపడుతున్న సంస్కరణలతో 2018లో ఏపీ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రెక్కింగ్‌లో తప్పిపోయిన విద్యార్థులు

నేవీ హెలికాప్టర్ గాలింపు.. ఆచూకీ లభ్యం



విశాఖపట్నం, డిసెంబరు 31 (మనం న్యూస్): విశాఖ సమీపంలోని సింహాచలం కొండపై ట్రెక్కింగ్‌కు వెళ్లిన విద్యార్థుల్లో కొందరు తప్పిపోయారు. దీంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. నేవీ హెలికాప్టర్ రంగంలోకి దిగి కొండంతా జల్లెడ పట్టడంతో వారి ఆచూకీ దొరికింది. ఆదివారం ఉదయం సీతమ్మధారకు చెందిన 20 మంది విద్యార్థులు సింహాచలం కొండపైకి ట్రెక్కింగ్ వెళ్లారు. వారిలో ఆరుగురు తప్పిపోయారు. అటవీ ప్రాంతం కావడంతో వారి సెల్‌ఫోన్లు కూడా పనిచేయలేదు. దీంతో మిగిలిన 14 మంది ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును కలిసి విషయం చెప్పారు. ఆయన జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, నగర పోలీసు కమీషనర్ యోగానంద్‌లకు సమాచారం అందించారు. తప్పిపోయిన వారి కోసం వెంటనే 60 మంది పోలీసులను రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టారు. తూర్పు నావికాదళాధికారులకు సమాచారం అందించడంతో వారు హెలికాప్టర్‌తో గాలింపు చేపట్టారు. నేవీ సిబ్బంది కొండంతా జల్లెడ పట్టి విద్యార్థులను క్షేమంగా బయటకు తీసుకువచ్చారు.

చేదెక్కనున్న చక్కెర!



ఏటా తగ్గుతున్న చెరుకు సాగు

- పంచదార ఉత్పత్తి తగ్గుముఖం
- ప్రభుత్వం నుంచి లేని ప్రోత్సాహం
- సాగుకు రైతన్నలు వెనకడుగు
- ఏడాది కష్టపడ్డా లాభాలు అంతంతే
- మూత పడుతున్న కర్మాగారాలు
- 40 లక్షల టన్నులు తగ్గిన దిగుబడి

విశాఖపట్నం రూరల్, డిసెంబరు 31 (మనం న్యూస్): దేశంలో పండించే ప్రధాన పంటల్లో చెరుకు ఒకటి. పంచదార ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ రెండో స్థానంలో ఉంది. కాగా ఏటా చెరుకు సాగు విస్తీర్ణం, పంచదార ఉత్పత్తి క్రమేణా తగ్గుముఖం పడు తుండటం ఆందోళన కలిగించే విషయం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పంచదార కొరత ఏర్పడటంతో పాటు ధరలు పెరిగే అవకాశముందని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. చక్కెర ఉత్పత్తిలో బ్రెజిల్ 408.33 లక్షల టన్నులతో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది. భారత్ 258 లక్షల టన్నుల ఉత్పత్తితో రెండో స్థానంలో ఉంది. బ్రెజిల్‌లో చెరుకు రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభిస్తోంది. దీంతో వారు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. కాగా దేశంలో ఇందుకు భిన్న మైన పరిస్థితి ఉంది. ఇక్కడి ప్రభుత్వాలు చెరుకు సాగు రైతులపై శీతకన్ను వేస్తున్నాయి. రైతులకు ప్రభుత్వాల నుంచి తగిన సహకారం లేదు.

ఏడాది శ్రమించినా..

చెరుకు పండించాలంటే రైతులు ఏడాది పాటు కష్టపడాలి. శ్రమకు తోడు పెట్టుబడి కూడా ఎక్కువ అవుతుంది. ఇతర వాణిజ్య పంటలు అయితే దాదాపు నాలుగు నెలలకు చేతికి వస్తాయి. చెరుకు పంట కోసం అయితే రైతులు ఏడాది ఎదురు చూడాలి. ఇంతటి వ్యయ, ప్రయాసలతో చెరుకు సాగు చేసినా ఆశించిన స్థాయిలో రైతులకు లాభాలు రావడం లేదు. చెరుకు సాగు చేయాలంటే ఎకరాకు 18 నుంచి 25 వేల రూపా యలు ఖర్చు అవుతుంది. పంట బాగా వస్తే 20 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. కర్మాగారాల్లో టన్ను చెరుకు ధర 2300 పలుకుతోంది. ఏడాది కష్టప డితే, ఖర్చులు పోను రైతుకు ఎకరాకు 20 వేల కన్నా ఎక్కువ మిగలదు. ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బ తింటే లాభం సంగతి అటుంచి పెట్టిన పెట్టుబడి కూడా వెనక్కు రాదు. దీంతో చెరుకు సాగుపై రైతులు ఆసక్తి చూపకపోవడంతో ఉత్పత్తి తగ్గుతోంది.

మూతపడుతున్న కర్మాగారాలు

పంచదార ఉత్పత్తి తగ్గడానికి చెరుకు సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు నష్టాలతో కర్మాగారాలు మూతపడుతుండటం మరో కారణం. చక్కెర కర్మాగారాల విషయంలో కూడా ప్రభుత్వ విధానాలు అనుకూలంగా లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. దేశవ్యాప్తంగా అనేక కర్మాగారాలు మూతపడుతున్నాయి. ఈ కారణంగా 2015-16లో దేశ వ్యాప్తంగా 244.54 లక్షల టన్నుల పంచ దార ఉత్పత్తి రాగా, 2016-17లో 205.60 లక్షల టన్నులకు పడిపోయింది. 2004-05 నుంచి గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే 57 నుంచి 67.6 శాతం ఉన్న ఉత్పత్తి.. 2016-17కు వచ్చేసరికి 54 శాతానికి పడిపోయింది. దేశ వ్యాప్తంగా 496 కర్మాగారాలు ఉండగా అత్యధికంగా మహారాష్ట్రలో 248 ఉన్నాయి. వీటిలో 105 మూతపడ్డాయి. ఆ తర్వాత ఎక్కువ కర్మా గారాలున్న ఉత్తరప్రదేశ్‌లో 145కి గాను 26 మూతపడ్డాయి. మూడవస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 30 ఉండగా, 9 మూత పడ్డా యి. తెలంగాణలో 11 కర్మాగారాల్లో 6 మూతపడ్డాయి. అలాగే అన్ని రాష్ట్రాలలో ఏటా కర్మాగారాలు మూతపడుతున్నాయి. దేశంలోని కర్మాగారాల ద్వారా 271 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. మహారాష్ట్ర 75 మెగావాట్లతో ప్రథమ స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 23 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతుంది. ఇక చక్కెర వినియోగంలోకి వస్తే ఏటా దేశంలో సుమారు 348.66 లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతుండగా 248 టన్నుల పంచదారను వినియోగిస్తున్నారు. 25.16 లక్షల టన్నులు విదేశాలకు ఎగుమతి చేస్తుండగా, సుమారు 75 లక్షల టన్నులు గోదాముల్లో నిల్వ ఉంటోంది. కాగా ఈ ఏడాది ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే చక్కెర కొరత ఏర్పడటం, ధరలు పెరగడం ఖాయంగా కనిపిస్తుంది.

ప్రభుత్వం ఆదుకోవాలి: రైతులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలతో కూడిన ప్రోత్సాహకాలు, రుణాలు అందించాలని చెరుకు రైతులు కోరుతున్నారు. అలాగే కర్మాగారాల స్థితి గతులపై దృష్టి సారించి, ఆర్థికసాయం అందించి చెరుకు పరిశ్రమను ఆదుకోవాలని కోరుతున్నారు.



నేను అండగా ఉంటా

- ప్రజలకు జగన్ భరోసా.. చిత్తూరులో పాదయాత్ర

చిత్తూరు, డిసెంబరు 31: చిత్తూరు జిల్లాలోని ఎద్దులవారిపల్లె, రేణుమాకులపల్లె క్రాస్, పరదేశీపల్లె క్రాస్, తూపల్లిక్రాస్‌లో ప్రతిపక్షనేత, వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ.. ప్రజలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా 48వ రోజు ఆదివారం మూలపల్లిక్రాస్ నుంచి జగన్ పాదయాత్రను ప్రారంభించారు. ఎర్రసానిపల్లె, ఎద్దులవారిపల్లె, కన్నెమడుగు, కె రామిగానివారిపల్లె, రేణుమాకులపల్లి క్రాస్ మీదుగా తిమ్మయ్యగారిపల్లి చేరుకున్నారు. అక్కడి నుంచి పరదేశిపల్లె, దాదంవారిపల్లి, తుపల్లి క్రాస్ మీదుగా ముదివేడు చేరుకుని అక్కడ యాత్ర ముగించారు.

2018 ఆనంద సంవత్సరం కావాలి

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2018 అభివృద్ధి, ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ సంవత్సరం తెలుగు రాష్ట్రాల ప్రజల జీవితాల్లో, దేశ ప్రజలందరి జీవితాల్లో మంచి మార్పులకు దారి తీయాలని ఆయన కోరుకున్నారు.



మనం కుటుంబం
సోమవారం, 1 జనవరి 2018
www.manamnews.com

తీర్మానాల తీరు మారాలి 2018

కొత్త సంవత్సరాన్ని సరికొత్తగా మొదలుపెట్టాలి.. ఇందుకు కఠినమైన నిర్ణయాలు తీసుకుని, వాటిని పొల్లు పోకుండా ఆచరించాల్సిందేనని అందరూ అనుకొంటాం. చిన్నా పెద్దా అంతా న్యూ ఇయర్‌లో న్యూ డెసిషన్స్ తీసుకోవడం రొటీనే అయినా, వాటిని ఏమాత్రం అమలు చేయకపోవడం మరో షరా మామూలు వ్యవహారం. గతంలోలా కాకుండా ఈసారి నూరు ఆరైనా ఆరు నూరైనా తీసుకున్న నిర్ణయాలన్నింటినీ అమలు చేయాలనుకునే టాప్ 10 అంశాలిలా ఉంటాయి..



ఆహారపు అలవాట్లు మార్చుకుందాం

అయిపోయింది.. ఇక న్యూ ఇయర్ వచ్చేస్తోంది.. నేను నా లైఫ్‌స్టైల్ పూర్తిగా మార్చేసుకుంటూ.. కేవలం ఆరోగ్యకరమైన ఆహారాన్నే తీసుకుంటా.. నో జంక్ ఫుడ్.. నో హెవీ కెలరీలు.. సాత్వికాహారం.. మితాహారం.. ఇలా ఒక్కటేమిటి.. మొత్తం సాధుజీవిలా మారిపోయి, ఆరోగ్యకరమైన అలవాట్లు సొంతం చేసుకుందామని కలలుకంటూనే ఉంటాం.. ఈలోగా కొత్త సంవత్సరం కూడా గడిచిపోయి, క్యాలెండర్ మారిపోతుంది.. మళ్లీ ఇదే పాటనే వచ్చే సంవత్సరాంతంలో గుర్తు చేసుకుంటాం.



సేవ చేద్దాం

సమాజానికి, దేశానికి ఏదో ఒకరూపంలో సేవ చేద్దాం.. కొత్త సంవత్సరం నుంచి అయినా దీన్ని ఆచరణలో పెట్టాల్సిందే అనుకోవడం.. తిరిగి వ్యక్తిగత జీవితంలో బిజీ అయిపోవడం, సంఘసేవను గాలికి వదిలేయడం అనేది సర్వసాధారణ అంశంగా మారింది. నా బతుకు నాకు బతికేందుకే తీరిక లేదు.. ఇక ఇతరులను ఏం ఉద్ధరించగలం అనే మెట్టవేదాంత చట్రంలో మనల్ని మనం బంధించుకోవడంతో.. ఈ న్యూ ఇయర్ రెజల్యూషన్ గాలికి వదిలేస్తాం.

ముందు ముందు మందు..

ఇక తాగడానికి ఫుల్‌స్టాప్ పెట్టేయాలని తీర్మానం చేసుకోవడం, ఇంట్లోవారికి మాటిచ్చేయడం.. ఆ తర్వాత చేతులెత్తేయడం.. యువతకిది రొటీన్ వ్యవహారంగా మారిపోయింది. అదేమంటే వచ్చే సంవత్సరం నుంచి అన్నీ బంద్.. ఈ ఏడాదికింతే అని మళ్లీ మందుబాబుల అవతారం ఎత్తడంతో టాప్ టెన్ న్యూ ఇయర్ రెజల్యూషన్స్‌లో దీనికి చెరగని స్థానం దక్కింది.

కొత్తదేదైనా నేర్చుకోవాలి

ఈ సంవత్సరం కొత్తది ఏదైనా నేర్చుకోవాలని మనమంతా అనుకుంటాం. బాగా వంట చేయడం నేర్చుకోవాలి, లేకపోతే డ్రైవింగ్ నేర్చుకోవాలి, రోజూ ఏదో ఒక పుస్తకం చదవాలి.. ఇలా ఏవేవో ప్రతి సంవత్సరం మనల్ని మనం మానసికంగా సిద్ధం చేసుకుంటాం.. కానీ తెల్లరాగానే మనకై మనం పెట్టుకున్న ఈ షరతులన్నీ మరిచిపోయి, హాయిగా రొటీన్ లైఫ్‌లో పడిపోతాం. ఆ తర్వాత ఎప్పటికోగానీ ఇలాంటి విషయాలు మనకు గుర్తుకు రావు. ఇలా గుర్తొచ్చినప్పుడు.. ఆ వచ్చే ఏడాది నుంచి ఇది ఫాలో అయిపోదాం అని మళ్లీ వాయిదా వేసేసి చేతులు దులుపుకుంటాం. దీంతో కథ మొదటికి వస్తుంది.

అప్పులొద్దు, పొదుపు ముద్దు!

ఇలాంటి ఆలోచనలు రాని మధ్యతరగతి సామాన్యులుండరు. కొత్త సంవత్సరంలో కొత్త అప్పులు ఒక్క రూపాయి కూడా తీసుకోకూడదు, పైపెచ్చు పొదుపు మాత్రమే చేయాలని అనుకోవడం, మళ్లీ చేబదులు, అప్పులు, లోన్లు అంటూ విషవలయంలో చిక్కుకుపోవడం మధ్యతరగతి ప్రజల ఆర్థిక ఆనవాయితీగా మారిపోయింది. అవసరాలకు తగినంత జీతం రాక.. వచ్చిన జీతంతో అవసరాలు తీరక.. ఇటు అప్పులు చేయకుండా ఉండలేక.. లైఫ్‌స్టైల్ మార్చుకోలేక పోతున్న మనవాళ్లు, న్యూ ఇయర్ అంటే చాలు.. ఆర్థిక విషయాల్లో రెండో జన్మ ఎత్తాల్సిందేనని తెగ నిర్ణయాలు తీసుకునేస్తాం. ఈ ఆవేశాన్ని తేలిగ్గా మరిచిపోయి, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు స్వైప్ చేస్తూపోతాం.

ఒత్తిడిని తరిమేద్దాం

హాయిగా, ఒత్తిడి లేని జీవితాన్ని ఇక మీదటైనా ఆస్వాదించాలి అని న్యూ ఇయర్ రెజల్యూషన్ తీసుకోవడం చాలా సహజం. కానీ దీన్ని అమలుచేయలేక ఒత్తిడిలోనే మునిగి తేలుతూ, నిద్రపోయినా, నిద్ర లేచినా అంతా ఒత్తిడిలోనే అన్నట్టు సాగిపోయే నిత్య జీవితంలో కొట్టుకుపోవడం మనందరికీ బాగా అనుభవమున్న సంగతే. టెన్షన్.. టెన్షన్.. టెన్షన్.. అంతే ఇంకేమీ ఉండదు. దీంతో ఓవైపు అనారోగ్యం, మరోవైపు ఉద్యోగంపై కూడా దీని ప్రభావం పడి పనితీరు మందగించడంతో మళ్లీ ఒత్తిడిలో కొట్టుకుపోవడం.. ఇవన్నీ ఓ సైకిల్‌లా సాగుతూనే ఉంటాయి. అయినా మనం ఒత్తిడి లేని జీవితాన్ని గడపలేమా అనే దానిపై సరైన ఫోకస్ పెట్టక కొత్త ఒత్తిళ్లకు బలవుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా అన్ని వయసుల వారిని వేధిస్తున్న విషవలయం ఒత్తిడి. ఈ ఊబినుంచి బయటికి రాలేక అత్యధికులు మరింత లోతుల్లోకి కూరుకుపోతున్నారు.

కొత్త లోకం చూద్దాం...

అలా ప్రపంచాన్ని చుట్టిరావాలి.. ఈ ప్లేస్, ఆ ప్లేస్ అన్నీ చూడాలి, కాళ్లకు చక్రాలు కట్టుకుని అన్నీ కలియతిరగేయాలి అనుకోవడం.. చివరికి ట్రావెల్‌కి తగినంత డబ్బు సమకూరక, సెలవు దొరక్క వెకేషన్ అంటే ఏదో అలా గడిచిపోవడం మధ్యతరగతి వారిని వెంబడించే మరో సమస్య. ఈ ఏడాదైనా ఫలానా ఊరు చూసి రావాలని అనుకోవడం, కుదరకపోవడంతో భవిష్యత్‌లో ఎప్పుడైనా వెళదాం అనుకోవడంతో కొత్త సంవత్సరారంభంలో ఉన్న ఆలోచన, మొగ్గలోనే తుంచేసినట్టు అయిపోతుంది.

ఫిట్‌నెస్ ఫస్ట్..

ఇలా న్యూ ఇయర్ రెజల్యూషన్స్ తీసుకునేవారిలో అత్యధికులు శ్రద్ధ చూపేది ఫిట్‌నెస్‌పైనే. భూమి ఆకాశం ఏకమైనా తెల్లవారుజామున లేవాలి, రాత్రి త్వరగా పడుకోవాలి. ఫిట్‌నెస్‌పై ఏకాగ్రత సారించి, సన్నబడాలి అనుకునేవారు ప్రపంచవ్యాప్తంగా కోకొల్లలున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రతి జనవరిలో జిమ్ములు కుప్పలు తెప్పలుగా డీల్స్ ఇస్తాయి. ఇలాంటివాటిపై జరిగిన సర్వేలో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఇలా ఫిట్‌నెస్ క్లబ్బుల్లో సభ్యత్వం తీసుకునే వారిలో 60 శాతం మంది ఆ తర్వాతి రోజుల్లో అసలు జిమ్ ముఖం కూడా చూడరన్నది దీని సారాంశం. 11 నెలల తర్వాత మళ్లీ వచ్చే జనవరిలో ఇదే నిర్ణయాన్ని తీసుకోవడం సన్నబడాలని కలలు కనడం సర్వసాధారణంగా మారిపోయింది. లేజీగా రొటీన్ మొదలుపెట్టడం, రోజువారీ టెన్షన్లతో జీవితాన్ని నెట్టుకొచ్చేయడంతో ఫిట్‌నెస్ ట్రాక్‌మీద పడదు.. సన్నబడడం అనే మాట దాదాపు ఎప్పటికీ నిజం కాదు.

పొగకు పొగపెట్టలేక..!

అయిపోయింది.. ఇక ఈరోజుతోనే లాస్ట్.. ఇక రేపటినుంచి నో స్మోకింగ్.. కొత్త సంవత్సరంలో కొత్త జీవితం.. ఇలా అనుకునేవారికి లెక్కలేదు. ప్రతి ఏటా కొత్త సంవత్సరం కోసం తీసుకునే టాప్ 10 నిర్ణయాల్లో తప్పకుండా ఉండే అంశం 'క్విట్ స్మోకింగ్'. పొగకు పొగబెట్టలేక ధూమపాన ప్రియులుగానే ఉండిపోతూ, అప్పుడప్పుడూ సిగరెట్‌కు గుడ్ బై కొట్టాలనుకుంటూ.. ఇలాగే సిగరెట్లతో తమ ప్రేమను కొనసాగిస్తుంటారు. ఈ వ్యసనం నుంచి బయట పడేందుకు మార్కెట్లో ఎన్నో విధానాలు అందుబాటులోకి వచ్చినా, పిడికెడు మంది మాత్రమే ఈ అలవాటును పూర్తిగా మానేయగలుగుతున్నారు. కొత్త సంవత్సరంలో తమను మార్చుకోవాలనుకునేవారిలో కనీసం 15 శాతం మంది కూడా ధూమపానాన్ని శాశ్వతంగా మానేయలేకపోతున్నారు.









కుటుంబంతో ఎక్కువ సమయం

బిజీ జీవితంలో కుటుంబంతో గడిపే సమయం ఎక్కువగా ఉండటం లేదు.. ఇలా కాదు కానీ.. ఇక జనవరి ఒకటో తేదీ నుంచి కుటుంబానికే అత్యధిక సమయం కేటాయించాలన్న నిర్ణయం తీసుకునే సెలబ్రిటీలు, సామాన్యులు చివరికి.. ఆ ఎప్పుడూ ఉండే భవసాగరాలే కదా అని మళ్లీ ఫ్రెండ్స్, ఆఫీసు, కొలీగ్స్ అనుకుంటూ పాత లైఫ్‌స్టైల్‌నే కొనసాగిస్తారు. ఆఫీసు అయిపోగానే డైరెక్ట్‌గా ఇంటికొచ్చి వాలిపోవాలి, ఇంకెక్కడికీ వెళ్లరాదన్న విషయాన్ని కనీసం జనవరి నెలంతా కూడా అమలుచేయలేకపోవడం మనం తరచూ వింటూంటాం.










ఏటా కొత్త సంవత్సరానికి నాంది పలికే జోష్‌లో తీసుకునే నిర్ణయాలు దాదాపు ఆచరణలోకి రావు, ఇలా తాము తీసుకున్న నిర్ణయాలను నిజంగా అమలుపరిచేవారి సంఖ్య అత్యల్పంగా ఉండటం అత్యంత సహజమైన విషయంగా మారిపోయింది. 'మార్పు తప్ప ఏదీ శాశ్వతం కాదు' అన్న కఠోర సత్యాన్ని గుర్తుంచుకుంటే ఏదైనా సాధ్యమే.. దీనికి వజ్రసంకల్పం ఏమాత్రం అవసరం లేదు. భారీ డైలాగులు కొట్టకుండా, అతిగా ఆలోచించకుండా, మీ సన్నిహితులు, అయినవారు మిమ్మల్ని ఎలా చూడాలనుకుంటారో అలా మారేందుకు .. మీ జీవితంలోకి చిన్న చిన్న మార్పులను ఆహ్వానించి చూడండి, అప్పుడు న్యూ ఇయర్ నిజంగా హ్యాపీ న్యూ ఇయర్ అవుతుంది.





బోగి పళ్ల బుట్టల స్పెషల్ రంగోలి



25 చుక్కలు, ఒకటి వచ్చేవరకూ సంధి చుక్కలు పెట్టి.. బోగి పళ్లతో వేసిన ఈ ముగ్గు కంటికి ఇంపుగా కనిపిస్తుంది. వేయడం సులువు, ఇక మంచి కాంబినేషన్లో రంగులు నింపితే ఈ రంగోలి మీ ఇంటికి కొత్త కళను తెస్తుంది. ఇలాంటి క్రియేటివ్ ముగ్గులు వేసేప్పుడు గీతలు ఎప్పుడూ చక్కగా వేయకూడదు. మీరు వేస్తున్న డిజైన్‌కు అనుగుణంగా వంపులు తిప్పినట్టు వేస్తే ముగ్గులో జీవం ఉట్టిపడుతుంది. రంగోలీలో నింపే రంగులు కూడా సహజత్వానికి దగ్గరగా ఉండేలాంటి కాంబినేషన్ వేస్తే అదిరిపోతుంది. ముగ్గులో రంగులు నింపాక.. అవుట్‌లైన్‌ను కాస్త లావు దబ్బులా వేస్తే మీ రంగోలి స్పెషల్ రంగోలి అవుతుంది.

మన సాహితి

'తప్పులు చేసేవారిని ప్రశ్నించడం కాదు; వారిపై నిప్పులు కురిపించాలి. తప్పుల మీద విమర్శ వుండదా? 'తప్పు' నాదే అయితే, దాని మీద ఇతరుల విమర్శ వుండదా? విమర్శే లేకపోతే, తప్పుల్లోనే కూరుకుని వుండిపోతాం కదా? నిప్పులు కురిపించడం అవసరం అయినంత తప్పులు అయితే, నిప్పులు కురిపించవలసిందే కదా? మార్క్సిజం తెలియక ముందే నేను విముక్తి పొందాను. కథలు రాయడం ప్రారంభించిన కాలంలో, 'నేను' అని ఉత్తమ పురుషలో రాయడం తేలిగ్గా వుంటుంది. 'నేను' అన్నప్పుడు, స్వంత విషయాలు కూడా వుంటే వుండొచ్చు. అంత మాత్రాన, అది నా 'డెరీ' కాదు; నాకా అలవాటే లేదు. రచయిత్రి స్థితి అలా వుండొచ్చు అని, అలా చెప్పడమే.' - ఎవరైనా తప్పు చేస్తే నిలదీయడం ప్రఖ్యాత రచయిత్రి రంగనాయకమ్మ సహజ లక్షణం. ఆమె నిజ జీవితంలోనైనా అంతే... రచనా వ్యాసంగంలోనైనా అంతే! 'ప్రేమకన్నా మధురమైనది' అన్నా, 'జానకి విముక్తి'ని ఆశించినా, 'రామాయణ విషవృక్షం' రాసినా ఆమెకు ఆమేసాటి. మార్క్సిస్టు దృక్పథంతో రచనలు చేయడం ఆమె ప్రత్యేకత.



రచన అంటే ఆత్మకథ కాదు

స్త్రీ పురుష సమానత్వం గురించి దాదాపు ఆరు దశాబ్దాలుగా కథలూ, నవలలూ, వ్యాసాలూ రాస్తూ వస్తున్న రచయిత్రి రంగనాయకమ్మ. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో 'రంగనాయకమ్మ నవలల్లో స్త్రీ పాత్రల పరిణామ క్రమం' అనే అంశం మీద పిహెచ్. డీ చేస్తున్న బి. అరుణ చేసిన ఇంటర్వ్యూలో ఒక భాగం ఇది.



రంగనాయకమ్మ రాసిన 'కృష్ణవేణి', 'నా డైరీలో ఒక పేజీ', 'స్త్రీ', 'రచయిత్రి', 'అంధకారంలో', 'స్వీట్‌హోమ్', 'జానకి విముక్తి', 'ప్రేమకంటే మధురమైనది..', 'కుటుంబ జీవితం' నవలల్లోని పాత్రల గురించి ఆమె మాటల్లోనే...

ప్రశ్న: ''కృష్ణవేణి'' నవలలో మీరు రెండు ముగింపులు ఇవ్వడంలో ఆంతర్యం?

జవాబు : ఏ సమస్యకైనా రెండు రకాల ముగింపులు ఇవ్వడం తప్పు! 'అది తప్పు' అని అప్పుడు తెలియలేదు. ఆ నవల చదివిన పాఠకుల్లో కొందరు, ''ముగింపు ఇలా వుంటే బాగుంటుంది' అంటే, 'కాదు, అలా ఉండాలి' అని కొందరు అన్నారు. ఆ కొందరు, ఎందరో కాదు; ఇరుగు పొరుగులైన నలుగురైదుగురే. 'రెండు ముగింపులూ వుంటే బాగుంటుందా?' అనిపించి, సరైన అవగాహన లేక చేసిన పని అది. సమస్యని పరిష్కరించడం చేత కాలేదు. ఇదంతా ఆ నవలలోనే తర్వాత రాసినట్టున్నాను, 2010లో ఇచ్చిన ముద్రణలో.

ప్రశ్న: మీరు 1963లో రాసిన 'నా డైరీలో ఒక పేజీ' నవలికలోని రచయిత్రి పాత్రకి ప్రేరణ?

జవాబు : ఆ రచయిత్రి ఊహా రచయిత్రే. రచయిత్రులు అయినా, భర్తల ఆధీనంలో వుండేవాళ్ళే - అని చెప్పాలనే. కథలు రాయడం ప్రారంభించిన కాలంలో, 'నేను' అని ఉత్తమ పురుషలో రాయడం తేలిగ్గా వుంటుంది. 'నేను' అన్నప్పుడు, స్వంత విషయాలు కూడా వుంటే వుండొచ్చు. అంత మాత్రాన, అది నా 'డైరీ' కాదు; నాకా అలవాటే లేదు. రచయిత్రి స్థితి అలా వుండొచ్చు అని, అలా చెప్పడమే.

ప్రశ్న : 'స్త్రీ' నవలలో పద్మజ, పార్వతీల భిన్న వైఖరులకు, వారి ఆర్థిక స్థితిగతులే కారణమా?

జవాబు : కుటుంబాల్లో, ఆర్థిక స్థితుల వల్ల ఏర్పడే తేడాలు తప్పకుండా వుంటాయి. అయినా, ఒకే కుటుంబంలో పెరిగిన వ్యక్తులు, సమాజ సంప్రదాయాలకు వేరువేరుగా ప్రభావితులవడం కూడా వుంటుంది. పద్మజ అన్న, పద్మజ లాగ లేడు. సమాజంలోనే వేరువేరు భావాలు వున్నాయి. పద్మజకీ, పార్వతికీ తేడా వుంటే, ఆ వేరువేరు భావాలు గానీ, వేరువేరు చదువులు గానీ, కారణాలు అవుతాయి - అనుకోవచ్చు.

ప్రశ్న : 'రచయిత్రి' నవలలో, విజయ తల్లి గారింట్లో వారు ప్రదర్శించిన చైతన్యం, నేటి స్థితిలో సాధ్యమా?

జవాబు : ఆనాటి చైతన్యం ఈనాటి స్థితిలో ఎందుకు సాధ్యం కాదు? భార్యాభర్తల మధ్య, తక్కువ-ఎక్కువ సమస్యలు తలెత్తితే, పరిష్కారం భార్య వల్లే కాదు; భర్త వల్ల కూడా జరగాలి - అని, భర్తే మారినట్టు నేను మొదట రాశాను. అది జరిగే విషయం కాదని, దాన్ని తర్వాత మార్చాను. వెనకటి కాలంలో కూడా, భర్తల అధికారాల నుంచి బైటపడి, ఒంటరిగా జీవించడాలు జరిగాయి. అటువంటి పరిస్థితుల్లో కూతుళ్ళకు దన్నుగా తల్లిదండ్రులు నిలబడ్డారు. ఆ ఘటనలు ఎక్కువగా లేకపోయినా, అలా జరగాలని చెప్పడమే రచనల లక్ష్యంగా వుండాలి.

ప్రశ్న : 'అంధకారంలో......', లలితపై బావ అత్యాచారం చేయబోయిన విషయాన్ని ఎంతో ఆలోచించి లలిత, అక్కకు చెప్పకుండా దాస్తుంది. 'ప్రేమకన్నా మధురమైనది'లో జయ, రమకి అటువంటి విషయం చెబుతుంది. ఇది మీ ఆలోచనలో వచ్చిన పరిణామంగా చూడవచ్చా?

జవాబు : కాదు. మొదటి కథలో వాళ్ళు అక్కాచెల్లెళ్ళు. రెండో కథలో వాళ్ళు స్నేహితురాళ్ళు. కథల్లోనూ, పాత్రల్లోనూ తేడా వుంది. ఆ తేడాల్లో, కొన్నిచోట్ల సంప్రదాయాల జాగ్రత్తలు వుంటాయి. కొన్నిచోట్ల సంప్రదాయాల లక్ష్యం వుండదు.

ప్రశ్న : 'అంధకారం'లో రచనలో కొంత ప్రత్యేకత కనిపిస్తుంది....?

జవాబు : ప్రశ్నార్థకం పెట్టారు. ఆ 'ప్రత్యేకత' ఎందుకు - అంటారా? తండ్రికి ఎంతో ఆస్తి వున్నప్పటికీ, అది అంతా కొడుక్కి దక్కింది గానీ, ఆడపిల్లకి చారెడు చోటు కూడా దక్కలేదు. 'అంధకారంలో....' ఎక్కువ విషాదం వుంది. ఆ కథ అటువంటిది. చదివిన పాఠకులు, ఏడుస్తూ చదివినట్టు చెపుతారు. ప్రేమ, విషాదంతో ముగిసింది. వేశ్యారికం, బతుకుదెరువు అయింది. భార్యాభర్తల సంబంధాలు, నరక స్థాయిల్ని మించిపోయాయి. మూఢనమ్మకాలు, ఆకాశానికి అంటిపోయాయి. ఇవన్నీ కలిసి వుండడం వల్లే కావచ్చు, అది దుఃఖాన్ని పుట్టించింది. ఇదే ప్రత్యేకత అయిందేమో!

ప్రశ్న : 'స్వీట్ హోమ్' మూడో భాగంలోని బుచ్చిబాబు పాత్రకి ప్రేరణ?

జవాబు : 1వ, 2వ భాగాల్లో వున్న వాళ్ళే 3వ భాగంలో కూడా. కొత్త స్వభావాలేమీ లేవు. విమలకి ఇంటిపనులే. బుచ్చిబాబుకి బైటిపనులే. అయినా, ఆ భర్త పెత్తందారు కాడు; ఆ భార్య, అణిగిమణిగి వుండే వ్యక్తి కాదు. అయినా, ఆమె కూడా బైటిపనీ; అతడు ఇంటిపనీ ప్రారంభిస్తే గానీ; అది 'సమానత్వం' కాదు. విమల బైటి పనులు ప్రారంభించింది. ఇంకా అలా చేసుకోవాలని చూస్తుంది.

ప్రశ్న : 'జానకి విముక్తి' చిత్రీకరణలో పిల్లవాడిపై సర్వ హక్కులూ జానకికి (తల్లికి) చెందినవిగా అతి సహజంగా చిత్రించారు.

> ఏ సమస్యకైనా రెండు రకాల ముగింపులు ఇవ్వడం తప్పు! 'అది తప్పు' అని కృష్ణవేణి నవల సమయంలో తెలియలేదు. ఆ నవల చదివిన పాఠకుల్లో కొందరు, ''ముగింపు ఇలా వుంటే బాగుంటుంది' అంటే, 'కాదు, అలా ఉండాలి' అని కొందరు అన్నారు. ఆ కొందరు, ఎందరో కాదు; ఇరుగు పొరుగులైన నలుగురైదుగురే. 'రెండు ముగింపులూ వుంటే బాగుంటుందా?' అనిపించి, సరైన అవగాహన లేక చేసిన పని అది. సమస్యని పరిష్కరించడం చేత కాలేదు.

జవాబు : ఆ కథలో అంతే. భార్యాభర్తలు విడిపోయిన నాటికి, ఆమెకి గర్భం వుందో లేదో, ఆ ప్రసక్తే లేదు. ఆ పిల్లవాణ్ణి తండ్రి కోరలేదు. చాలా మంది మగవాళ్ళు, పిల్లల్ని నిజంగా ఇష్టపడరు. వాళ్ళని పెంచే బాధ్యత తీసుకోరు. కాకపోతే, 'దూడని తోలుకుపోతే ఆవు వచ్చేస్తుంది' అన్నట్టు పిల్లల్ని బంధిస్తారు. ఇప్పుడు ఒక కొత్త ఆలోచన వస్తోంది. వెంకట్రావు, తన మేనమామని పంపించాలి, ఆ పిల్లాడి కోసం... 'నా కొడుకుని నాకు ఇయ్యి' అనే కబురుతో. అప్పుడు జానకి కోర్టుల వెంట తిరగడం కాదు. జానకి ఏం చెయ్యాలంటే, 'నా పిల్లవాడితో నీకు సంబంధం లేదు. నేను ఇక్కడికి వచ్చేశాక, ప్రభాకర్‌తో సంబంధంలో వున్నాను. దానివల్ల, నాకీ బిడ్డ కలిగాడు' అని చెపుతుంది. ఆ వచ్చిన మేనమామ నోరు మూసుకుని వెళ్తాడు. ఇలా చెప్తే వెంకట్రావు వూరుకోడు. పిల్లవాడికి ఏదో టెస్టు చేయించాలంటాడు. నిజం బయటపడితే, పిల్లాణ్ణి అతనికే ఇచ్చేస్తారు. ఇదంతా ఎందుకు? - వెంకట్రావు పిల్లాణ్ణి ఎలాగా వదిలేస్తాడు. కాబట్టి, ఆ గొడవంతా పెట్టుకోకపోవడమే బాగుంది.

ప్రశ్న : 'ప్రేమకన్నా మధురమైనది'లో రమతో జయ, హిందీ పాటల్లోని విషయం మాట్లాడుతూ, 'నేను ఎప్పుడూ నీ కోసమే అనే మాటలు ఒక స్త్రీ పురుషుడితో అనడంలో గొప్ప వుండదు; పురుషుడు స్త్రీతో అనడంలో చాలా గొప్ప వుంది' అంటుంది. (దాదాపుగా 'కృష్ణవేణి'లో కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.) ప్రేమ గొప్ప విషయం అయితే, అది ఎవరిలో కలిగినా గొప్ప విషయమేగా?

జవాబు : 'ప్రేమ'ని విడిగా చూస్తే, అంతే. కానీ అది, సమాజంలో స్త్రీ-పురుష సంబంధాల్ని బట్టి వుంటుంది. ఆడవాళ్ళు ఎప్పుడూ మొగవాళ్ళకి జన్మంతా అంకితమై వుంటారు. మొగవాళ్ళు తప్పకుండా వేరే సంబంధాల్లోకి పోతారు. అలా వుండే సమాజంలో, మొగవాళ్ళలో అంత చలించని ప్రేమ వుంటే, అది వింత విషయమే. సమాజాన్ని బట్టి చెప్పిన మాట అది.


ప్రశ్న : 'ప్రేమకన్నా మధురమైనది'లో భార్య తన పేరులో భర్త పేరును కలిపి రాసుకోవడం గురించి చర్చలో జయ, రమతో, 'నిన్ను నిన్నుగా వుండనిచ్చే సంస్కారం అతని నుంచీ ఆశించు''అంటుంది. ఆశించడమేనా?

జవాబు : అలా ఆశించడం కూడా తెలియని స్త్రీకి, అది మొదట తెలియాలి. ఆమె ఏమి కోరుతోందో, ఆ సంస్కారం భర్తకి వుంటే, అతను అక్కడితోనే ఆగడు. ఇతర విషయాల్లో కూడా 'సమానత్వాన్ని' గ్రహిస్తాడు. భార్యకైనా, భర్తకైనా, 'ఫలానా రకంగా ఆశించాలి' అని చెప్పడం అంటే, 'ఆశించింది జరిగినా, జరగకపోయినా, సరిపెట్టుకోండి' అని చెప్పడం కాదు. ఒక మంచి మార్పు ఆశించే వాళ్ళు ఇంకా మంచి వుంటే దాన్ని కూడా తెలుసుకుంటారు.

ప్రశ్న : మీ స్త్రీ పాత్రలు భర్తతో గానీ, ఇతర వ్యక్తులతో గానీ, సమస్యలు వస్తే, వాటిని పరిష్కరించుకునే క్రమంలో, అక్కడ నుంచి వెళ్ళిపోవడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి, ఎందుకని?

జవాబు : 'సమస్య'ని పరిష్కరించుకోవడానికి







ఆమె ఇతర రకాలుగా అంతకు ముందే ప్రయత్నించే వుంటుంది. అవి ఏవీ పనికిరాకే, ఆ సంబంధంలో నుంచి పోతుంది...అంతకన్నా ఇంకో పరిష్కారం వుండదు గనక.

ప్రశ్న : 'కుటుంబ జీవితం'లో సమానత్వం విలువల స్థాపనకై రావల్సిన మార్పులను దాదాపుగా మీ రచనలన్నింటిలోనూ చూడవచ్చు. అలాగే స్త్రీలకు సంబంధించి కుటుంబానికి బయటి సామాజిక జీవితంలో రావల్సిన మార్పులపై మీ నుంచి రచనలు ఆశించవచ్చా?

జవాబు : ఆ రచనల్ని, 'నవలల' రూపంలో ఆశిస్తే జరగకపోవచ్చు. అవన్నీ వ్యాసాల రూపంలో వున్నాయి. సమాజంలో ఎటువంటి మార్పులు జరగాలో మార్క్సిజం చెప్పింది. అది నేర్చుకోడానికీ, నేర్చుకున్నది రాయడానికే నా ప్రయత్నాలు.

ప్రశ్న : మీరు సుమారుగా 1955 నుంచి రచనలు చేస్తున్నారు కదా? అప్పటి మీ అనుభవాలకు, 70ల తర్వాత అనుభవాలకు ప్రత్యేకమైన తేడాలు ఏమైనా ఉన్నాయా?

జవాబు : తప్పకుండా వున్నాయి. ముఖ్యంగా, విషయం అంతా 'వర్గ దృష్టి'లోకి మారింది. 'శ్రమ దోపిడీ సంబంధాలు పోతే తప్ప ఏ సమస్యా మారదు' అని ఇప్పుడు వున్న దృష్టి గతంలో ఎక్కడ వుంది? అంతే కాదు; రాతలు ప్రారంభించిన గతంలో 'మతం' వుంది. వినాయక చవితి పూజలు చేశాం చిన్నప్పుడు. అదే కాదు; రాతలో, 'విషవృక్షం'నుంచి రాయడం, తేలిక అయినట్టు అనుకుంటాను. ఇతర విషయాల్లో కూడా తేడాలు వున్నాయి.

ప్రశ్న : దాదాపు మీ రచనలన్నింటిలోనూ ఆడపిల్లలు చిన్నప్పుడు వివక్ష లేకుండా పెరుగుతారు. దీనికి మీ అనుభవమే కారణమా?

జవాబు : అంతే - అనుకుంటాను. నా చిన్నప్పుడు, ఇరుగుపొరుగు కుటుంబాల్లో కూడా ఆడపిల్లలే ఎక్కువ. అయినా, వాళ్ళని తక్కువ వాళ్ళుగా చూసే సంఘటనలుండేవి కావు. అలా అని అన్ని ఇళ్ళల్లోనూ ఆడపిల్లల్నీ, మొగపిల్లల్నీ ఒక్కలాగే చూశారని కాదు. మా ఇంట్లో అయితే, ఒక్క మగ పిల్లవాడే. తర్వాత ఆరుగురు ఆడ పిల్లలం. అయినా, ఏమీ తేడాలు వుండేవి కావు. 'తండ్రి' అనీ, 'అన్న' అనీ, భయాలు వుండేవి కావు. ఇంటి వాతావరణం బాగుండేది.

ప్రశ్న : మీరు 'గమనం' ఇంటర్వ్యూలో పాత్రల గురించి వివరిస్తూ, 'భాను, కమల, విజయల పాత్రలు నేనే' అన్నారు కదా? ఈ మూడింటిలోనూ స్త్రీ చదువుకుని ఉండడం ఒకటి కామన్‌గా వుంది. కానీ, వారి మిగతా పరిస్థితులు వేరే కదా? దాని గురించి వివరిస్తారా?

జవాబు : 'మిగతా పరిస్థితులు' అనే వాటిలో కొన్ని తేడాలు వున్నా, ఆ 3 కథల్లోనూ, 'పేక మేడలు' మరీ ఘోరం. మిగతా వాటిలో, ఆ ఘోరం కొంత తగ్గింది గానీ, భర్త పాత్రలో తేడాలేమీ లేవు. అందరూ భర్తలే. పెత్తనాల్లోనే కొంత తక్కువా, ఎక్కువా.

ప్రశ్న : 'జానకి విముక్తి' రంగనాయకమ్మ విముక్తిగా భావించవచ్చా? ఎందుకంటే, ఆ నవల మీరు వైజాగ్ నుంచి వచ్చిన తర్వాత రాసిన మొదటి నవల కదా?

జవాబు : కాదు. 'జానకి విముక్తి' ఆలోచన, మార్క్సిజంతో వచ్చింది. 'విషవృక్షం' కూడా 'మార్క్సిజం' వల్ల వచ్చింది. ఈ మార్క్సిజం తెలియక ముందే, నేను విముక్తి చెందాను. బానిసత్వం నుంచి బైటపడడమే విముక్తి కదా? తర్వాత అంతా స్వేచ్ఛే! ఇక విముక్తి ప్రశ్న లేదు. నా జీవితానికీ, నా రచనలకీ, ఎన్ని పోలికలు వున్నా, 'రచన' అంటే, 'ఆత్మకథ' కాదు.

ప్రశ్న : మీ రచనల్లో, మీ జీవితానికి దగ్గరగా ఉన్న పాత్ర చెప్పమంటే...?

జవాబు : మొదట భానుమతే. అదే కొంతకొంత మారింది. ఎంత మారినా, అది భానుమతే. దాన్ని వదిలిన తర్వాత, విమలే. మధ్యలో జానకి వుంది గానీ, జానకి చిన్న ఉద్యోగంలో వుంది, నాకా జీవితం లేదు. నా రాతే, నా ఉద్యోగం అయింది. నా విముక్తి తర్వాతే, 'జానకి విముక్తి' గానీ, జానకి విముక్తి రాసినందువల్ల నా విముక్తి కాదు. 'అనుభవాలు' అన్నప్పుడు రచయితల స్వంత అనుభవాలే కావు. సమాజంలో తెలిసిన అనుభవాలన్నీ రచనల్లో కలుస్తాయి. ఒక రచన, ఒక నిజజీవితానికి ప్రతిబింబం కాదు. సమాజాన్ని అర్థం చేసుకునే మార్పుని బట్టి, నిజజీవితాన్నే చెప్పినా, ప్రతిబింబం మారుతుంది. నిజం మనిషీ, కథలో పాత్రా, ఒకే రకం కాలేవు.

ప్రశ్న : తప్పులు చేస్తే ఎంతటి వారి మీదైనా నిప్పులు కురిపిస్తారు. ఇది మీకెలా సాధ్యం?

జవాబు : ఈ మాటలు నచ్చలేదు నాకు. విమర్శ చెయ్యడం, నిప్పులు కురిపించడమా? 'తప్పులు చేస్తే' అని మీరే అన్నారు. తప్పుల మీద విమర్శ వుండదా? 'తప్పు' నాదే అయితే, దాని మీద ఇతరుల విమర్శ వుండదా? విమర్శే లేకపోతే, తప్పుల్లోనే కూరుకుని వుండిపోతాం కదా? నిప్పులు కురిపించడం అవసరం అయినంత తప్పులు అయితే, నిప్పులు కురిపించవలసిందే కదా?

ప్రశ్న : స్త్రీ స్వేచ్ఛ విషయంలో, మిమ్మల్ని, సంప్రదాయవాదులతో పాటు, కొందరు స్త్రీ వాదులు కూడా వ్యతిరేకిస్తారు, ఎందుకు?

జవాబు : 'సంప్రదాయవాదులు' అనే వాళ్ళు, భూస్వామ్య సమాజ భావాల వాళ్ళు. 'కొందరు స్త్రీ వాదులు' అన్నారే, వాళ్ళు, పెట్టుబడిదారీ భావాల ఫెమినిస్టులు. ఈ 2 రకాల వాళ్ళూ, మార్క్సిజానికి వ్యతిరేకులు. ఆ రకంగా వాళ్ళు, వాళ్ళ భావాలనే నిలబెట్టుకోడానికి చూస్తారు. కాబట్టి, మార్క్సిస్టు భావాల్ని వ్యతిరేకిస్తారు.

◆ బొర్రా అరుణ
పరిశోధక విద్యార్థి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
9395532951

కూల్ ఇన్ ఇండియా!

కవిత

సంకనెక్కిన చలేమిటిలా
సంపుకుంటూ నన్ను నంజుకుంటోందిలా
దేహమంతా మెల్లమెల్లగా ఆక్రమిస్తూ
దేశమంతా కొరుక్కొంటూ ఉరకలేస్తోందిలా
నరనరాల్లో నెమ్మనెమ్మదిగా దూరిపోతూ
జనాల్నంతా మత్తునేదో జల్లుకుంటూ
దుప్పట్లేదో ముసుగులేస్తూ
నన్ను మంచాన్నే బిగించేస్తుందేమిటిలా!

సంకనెక్కిన చలేమిటిలా
సంపుకుంటూ నన్ను నంజుకుంటోందిలా
కళ్ళెదుటే దశ్యాలేవో కదులుతున్నా
ఇంటిపక్కనే కేకలేవో వినపడుతున్నా
రంగు రంగుల టీవీల్లో స్పష్టంగా చూద్దామనో
మే థియేటర్ బాక్సుల్లో విస్పష్టంగా విందామనో
అనిపిస్తుందేమిటిలా!
మనం కన్నవే, మనం విన్నవే
వింతవింతగా మీడియాలో
మెదులుతున్నాయ్యేమిటిలా?

సంకనెక్కిన చలిప్పుడు
మునివేళ్ళ స్పర్శానుబంధమై
నెచ్చెలికంటే నాకు నులివెచ్చనయ్యింది
నెట్టింటలో పొట్టి పలుకు చాలు
బతుకంతా ప్లాస్టిక్ మనీ నేస్తమయ్యింది!
నాది తెలిసినట్లుండే అతి తెలివిడి తనమో
నాది గడ్డ కట్టిన ఒంటరి కలివిడి తనమో
నాది బలిసిన బద్ధకమో
నాది తలకెక్కిన మదమో
నా దేహమంతా సోకిన జ్వరమో
నాకప్పుడేమీ తెలియలేదు!
జేబుల్నుండి విత్తులన్నీ
చిట్టెలుకలేవో కొట్టేస్తున్నాయని
పొట్టి పలుకులు మొత్తుకున్నా మిన్నకున్నాను
నన్ను ఆకాశాన్నందుకునే
నిగ్రహానికే విగ్రహమేదో చేశారనుకున్నాను
నాకింతవరకూ
బ్యాంకులన్నీ రక్షణ కవచమనుకున్నాను
నాకిప్పుడిప్పుడే
పందికొక్కుచుట్టాలెవరో
దుప్పట్లన్నీ కొరికేస్తున్న శబ్దమేదో వినిపిస్తోంది
నాకిప్పుడిప్పుడే
వెన్నులో వణుకుబెణుకులేవో పుట్టకొస్తున్నాయి
నాకిప్పుడిప్పుడే
మీడియా చూపని బొమ్మలేవో
కళ్ళెదుటే బెదురుబెదురుగా కదులుతున్నాయి
నాకిప్పుడిప్పుడే
వైట్ హౌస్‌హారనేదో మెల్లమెల్లగా మత్తువదిలిస్తోంది
నాకిప్పుడిప్పుడే
పెయిడుకులొంగని అక్షరమేదో
నేలకింద పిడికిళ్ళై పలకరిస్తోంది
సంకనెక్కిన చలి వదిలే దాకా
ఋతువులెప్పుడు మారతాయోనని
ఎదురుచూస్తూ
సూర్యకిరణం తాకుకుంటూ
అంబేడ్కర్ - మార్క్స్ మార్గ్ వరకూ
అరిస్టాటిల్ సైకిలెక్కి పిక్కలరిగేలా తొక్కవలసిందే!
అంతవరకూ దేశమంతా చుట్టుతున్న
దేహమంతా పిండి పిండి చేస్తూ ఉన్నా
సంకనెక్కిన చలికి
నువ్వూ నేనూ వంగి వంగి మొక్కవలసిందే!

- దార్ల వెంకటేశ్వరరావు
9182685231

జీవితానికి పూచిన కాలం పువ్వు



జీవితం
చెట్టులా మారాక
ఆయువు పత్రహరిత మవుతుంది.
వచ్చిపోయే వసంతాల నడుము
ఆశ కొత్త చిగుళ్ళను తొడుగుతుంది.

నిన్నటి వరకూ
పొదవి పట్టుకొని కాపాడిన మాసాలు
రెక్కలు తొడిగి అనంత ఆకాశంలోకి
ఎగిరి పోయాయి.

కలలు కనుగుడ్లు పగిలి
దారిపొడుగునా కన్నీరొలికిన
స్రవంతి పరీవాహక ఉప్పు చారికలైనాయి.

ఏమో...,
కాలం ఎవరికెన్ని సంవత్సరాలు
వీలునామా రాస్తుందో...
ఎప్పుడు ఎవరి చేతిలో
కలల పరిమళ సుమ దళ బొకేలు పెడుతుందో....

డైరీ పుటల నడుమ
రేపటి భవిత కొంగ్రొత్త రంగుల రోజుల
రోజాలను స్వప్నిస్తూ...
తెల్లరేకై పల్లవిస్తుంది.

రండి.
శుభాకాంక్షలతో పలకరించుకుందాం
కేలండర్లతో పూల బొకేలతో
పరస్పరం నూతనంగా కౌగిలించుకుందాం
ఆత్మీయంగా కాలానికి అల్లుకుపోదాం
జీవితం
ఖడ్గచాలనమైనా
కాలంతో విర్నవ్వుల కరచాలనంచేద్దాం

(నూతన సంవత్సరం సందర్భంగా...)

- గరికపాటి మణీందర్.
99483 26270

5న 'తెలంగాణ సినిమా దశ దిశ' ఆవిష్కరణ

ప్రముఖ కవి, సినీ విమర్శకుడు వారాల ఆనంద్ రచించిన 'తెలంగాణ సినిమా దశ దిశ' పుస్తకావిష్కరణ రాష్ట్ర పట్టణాభివృద్ధి, ఐటి శాఖ మంత్రి కల్వకుంట్ల రామారావు ఆవిష్కరిస్తారు. జనవరి 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు సెక్రెటేరియట్‌లోని కార్యాలయంలో జరిగే ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అతిథిగా, సీఎం ప్రత్యేకాధికారి దేశపతి శ్రీనివాస్, కవి వఝల శివకుమార్ తదితరులు హాజరవుతారు.

- వారాల ఆనంద్, 9440501281

కవిసంధ్య - పానుగంటి కవితల పోటీ

అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 21న కవిసంధ్య కవిత్వ పత్రిక ''కవిసంధ్య పానుగంటి కవితల పోటీ''ని నిర్వహిస్తుంది. ఈ పోటీలో పాల్గొనడానికి కవులు ఎంట్రీ ఫీజుగా రూ.200లు మనియార్డరు / డ్రాఫ్టు లేదా నేరుగా బ్యాంకు ద్వారా చెల్లించాల్సి వుంటుంది. ఎంట్రీ ఫీజు చెల్లించిన వివరాలను కవితలతో పాటు జతపరచాలి. ఆధునికమైన భాష, అభివ్యక్తితో పాటు సామాజిక అంశాలపై రాసిన వచన కవితలకు ప్రథమ ప్రాధాన్యం. కవితలు ఫిబ్రవరి 20వ తేదీలోపు పంపాలి. పంపాల్సిన చిరునామా : దాట్ల దేవదానం రాజు, జక్రియానగర్, యానాం, 533 464. వివరాలకు 9440105987 ను సంప్రదించగలరు.

- కవిసంధ్య, యానాం

కవితాసంపుటాలకు ఆహ్వానం

'కవిత్వం బతకాలి - కవి మిగలాలి ' అనే నినాదంతో ఫేస్ బుక్ వేదికగా 'కవిసమ్మేళనం సాహిత్య వేదిక'ను స్థాపించి సాహితీసేవే పరమావధిగా భావించి జీవించిన కొత్తపల్లి నరేంద్ర బాబు సేవల్ని కొనసాగించేందుకు యేటా వారిపేరుతో పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నాం. 2016-2017లో వచ్చిన కవితా సంపుటాలను పురస్కార పోటీకి ఆహ్వానిస్తున్నాం. జనవరి 31 లోగా నాలుగు ప్రతులను కొత్తపల్లి సురేష్ (అక్షరమాలి), ఇంటి నెంబరు 6-1-149-1, జన్మభూమి రోడ్డు, లక్ష్మీనగర్, అనంతపురం-515001కు పంపాలి.

- కవిసమ్మేళన సాహిత్య వేదిక , 9493832470

'మన సాహితి'కి వ్యాసాలు, లేఖలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపాలి.
e-mail: manamsahiti@gmail.com



హజ్‌కు ఒక్కరే వెళ్లొచ్చు

- ముస్లిం మహిళలకు వెసులుబాటు
- 'పురుష సంరక్షణ' నిబంధన రద్దు
- ఆకాశవాణి 'మన్‌కీ బాత్'లో ప్రధాని

న్యూఢిల్లీ, డిసెంబరు 31: పురుష సంరక్షణ (మహ్రం)తో నిమిత్తం లేకుండా ముస్లిం మహిళలు హజ్ యాత్రకు వెళ్లరాదన్న ఆంక్షను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రద్దుచేశారు. ఇది వివక్ష ప్రదర్శించడమేనని, వందలాది మహిళలు ఒంటరిగా వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో ఈ విధానాన్ని తొలగిస్తున్నామని ఆయన వివరించారు. తదనుగుణంగా 45 ఏళ్లు దాటిన మహిళలు కనీసం నలుగురు వంతున బృందంగా ఏర్పడి యాత్రకు వెళ్లవచ్చునని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఆకాశవాణిలో ఈ ఏడాది తన చివరి నెలవారీ కార్యక్రమం 'మన్‌కీ బాత్'లో భాగంగా ప్రధాని ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఇది చాలా స్వల్ప విషయమే అనిపించవచ్చుగానీ, దీని ప్రభావం మన ప్రతిష్ఠ, మన సమాజంపై చాలానే ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆంక్ష గురించి తొలుత విన్నప్పుడు ఇలాంటి నిబంధనను రూపొందించింది ఎవరా? అని తాను ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. ''ఎందుకీ వివక్ష? అన్న ప్రశ్న నా మదిలో మొలకెత్తింది. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా ఇటువంటి ఆంక్షలను మనం రుద్దుతున్నామని తెలిసింది. దశాబ్దాలుగా ముస్లిం మహిళలపై ఇంత వివక్ష ప్రదర్శితమవుతున్నా దీనిపై ఎవరు చర్చించకపోవడం ఆశ్చర్యం'' అని వ్యాఖ్యానించారు. అనేక ఇస్లామిక్ దేశాల్లోనూ ఇలాంటి ఆంక్షలు లేవని గుర్తుచేశారు. ఈ ఏడాది సుమారు 1300 మంది మహిళలు హజ్ యాత్రకు ఒంటరిగా వెళ్తామని కోరుతూ దర ఖాస్తు చేశారు. వీరందర్నీ యాత్రకు అనుమతించాల్సిందిగా మైనారిటీ వ్యవహారాల శాఖకు సూచించినట్లు ప్రధాని వెల్లడించారు. 'సాధారణంగా లాటరీ పద్ధతిలో హజ్‌కు ఎంపిక చేస్తారు. అయితే, ఈ పద్ధతి నుంచి సదరు మహిళలను మినహాయించాలని, వారిని ప్రత్యేక వర్గంగా పరిగణించి అవకాశమివ్వాలని భావించాను' అన్నారు. మహిళా శక్తి, వారి ప్రతిభాపాటవాలతోనే భారత ప్రగతి పయనం సాధ్యమన్నది తన దృఢ విశ్వాసమని చెప్పారు. ఆ దిశగా మన దేశ మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు లభించాలని స్పష్టం చేశారు. ఇక క్రిస్మస్ గురించి మాట్లాడుతూ– ఏసుక్రీస్తు మానవాళికి సేవాభావనను ప్రబోధించాడని గుర్తుచేశారు. కుల–మత–వర్గాలు, సంప్రదాయాలు, శరీరఛాయలతో నిమిత్తంలేని అత్యున్నత మానవ విలువలకు సేవాభావం అమూల్య ఆభరణం వంటిదన్నారు. అలాగే గురు గోవింద్‌సింగ్ 350వ జయంతి సందర్భంగా ఆయన సాహసాన్ని, త్యాగాలను స్మరించారు. ఉత్కృష్ట మానవ విలువలను ప్రబోధించిన సిక్కు గురువు వాటిని స్వయంగా ఆచరించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు.

ఈసారి 'గణతంత్రం' ప్రత్యేకం

ఈసారి 2018 జనవరి 26న నిర్వహించబోయే గణతంత్ర వేడుకలను కొన్ని తరాలపాటు గుర్తుంచుకుంటారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ దఫా సంబరాల్లో దక్షిణాసియా దేశాల కూటమి (ఆసియాన్)లోని 10 దేశాల అధినేతలు ముఖ్య అతిథులుగా పాల్గొనబోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆలిండియా రేడియోలో ఈ ఏడాది తన చివరి నెలవారీ కార్యక్రమం 'మన్‌కీ బాత్'లో ప్రధాని ఈ విషయాన్ని ప్రకటించారు. 'ఇది భారతదేశ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టం' కాగలదని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఆసియాన్ ఏర్పాటై 2017కు యాభై ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కూటమికి ఇది 'స్వర్ణోత్సవ' సంవత్సరం కాగా, దానితో భారత్ భాగస్వామ్యానికి 25 ఏళ్లు పూర్తయినందున భారత్‌కూ ఈ ఏడాది ప్రత్యేకమైనదేనని పేర్కొన్నారు. మరోవైపు పరిశుభ్రత కార్యక్రమాల ప్రగతిపై ప్రభుత్వం 2018లో అధ్యయనం చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 4 నుంచి మార్చి 10వరకూ 4వేల నగరాల్లో 40 కోట్ల జనాభాతో అధ్యయన కార్యక్రమం సాగుతుందని వివరించారు. ఆ మేరకు ప్రత్యేక బృందాలు ఆయా నగరాల్లో సునిశిత పరిశీలన చేపడతాయని తెలిపారు. ఇక 21వ శతాబ్దారంభంలో పుట్టినవారికి 2018 నిండేసరికి ఓటు హక్కు లభిస్తుందని, ఆ విధంగా వారికీ ఇదో ప్రత్యేక సంవత్సరం కాగలదని ప్రధాని అన్నారు. ఈ 'నవ భారత ఓటర్ల'కు భారతీయ ప్రజాస్వామ్యం స్వాగతం పలుకుతున్నదని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో కులమత తత్వాలు, ఉగ్రవాదం, అవినీతికి తావులేని నవభారతాన్ని కొత్త తరం ఓటర్లు ఆవిష్కరించగలరన్న విశ్వాసం వ్యక్తం చేశారు. నవ భారత స్వరూపంపై 18–25 ఏళ్ల యువజనం చర్చించేందుకు వీలుగా దేశంలోని ప్రతి జిల్లాలో 'నమూనా పార్లమెంటు' నిర్వహించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 15కు ముందుగా ఢిల్లీలో ఈ కార్యక్రమం నిర్వహించాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి జిల్లానుంచి ఇందులో పాల్గొనే యువజనులను ఎంపిక చేస్తామని తెలిపారు.

ముమ్మారు తలాక్‌నుంచి స్వేచ్ఛ!

అనాదిగా అంతులేని బాధలు పడుతున్న ముస్లిం మహిళలకు ఇక 'విముక్తి' లభిస్తుందని ప్రధాని చెప్పారు. కేరళలోని శివగిరి మఠంలో 85వ శివగిరి యాత్ర వేడుకల ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన ప్రసంగించారు. 'ముమ్మారు తలాక్' నిషేధ బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించిన నేపథ్యంలో తొలిసారిగా పార్లమెంటు వెలుపల ఈ అంశంపై పరోక్ష వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అలాగే వివిధ సంస్కరణలు ప్రవేశపెట్టడంతోపాటు నల్లధనం, అవినీతి, బినామీ ఆస్తులు, ఉగ్రవాదం తదితరాలపై ప్రభుత్వం తిరుగులేని పోరాటం చేస్తున్నదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో 2018లో ప్రజలంతా సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలసి శ్రమించాలని పిలుపునిచ్చారు.

ప్రధాని పదవిపై ఆశలేదు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పి హాయిగా సమాజసేవ చేసుకుంటాను. మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్‌ను ఆదర్శంగా తీసుకున్నా. ఆయనలా బతకాలని కోరుకుంటున్నా. నాకు ప్రధానమంత్రి అవ్వాలనే కోరిక లేదు. ప్రధాని అయ్యే అర్హత కూడా నాకు లేదు'' అని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. 2017 తన జీవితానికి మలుపు అని ఆయన పేర్కొన్నారు. చట్ట సభలను ప్రతిపక్షాలు సద్వినియోగం చేసుకోవాలని, చట్ట సభల్లో నిరసన తెలపడానికి వాకౌట్ల వంటి అనేక మార్గాలున్నాయన్నారు. పార్టీలు తీసుకునే నిర్ణయాలపై తాను వ్యాఖ్యానించనని చెప్పారు. అందరితో కలివిడిగా ఉండడం తన స్వభావం కావడం వల్ల, ప్రోటోకాల్ తనను ఇబ్బంది పెడుతున్న మాట వాస్తవమని అన్నారు. ఈ సందర్భంగా ఫిరాయింపులపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. వీటిపై మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. తాను ఫిరాయింపులపై సంచలన నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ప్రజల ఆలోచనల్లో సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. భావితరాలు కష్టపడటం నేర్చుకోవాలన్నారు. దేశంలో క్యాష్, కమ్యూనిటీ, క్యాస్ట్ ప్రభావం రాజకీయాల్లో ఉండటం అంత మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ప్రజలు కూడా కులాల గురించి ఎక్కువగా ఆలోచించవద్దని హితవు పలికారు. కాగా పోలవరం, ఇళ్ల నిర్మాణాలపై సంబంధిత మంత్రులతో మాట్లాడానని, పరిపాలనా సౌలభ్యంగా అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాలు ఉండాలని వెంకయ్య అన్నారు. భవనాల డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. తన పరిధిలో తెలుగు రాష్ట్రాలకు.. ప్రజలకు సేవ చేస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ''దేశంలో 35 సంవత్సరాల వయస్సు ఉన్న వారు 60 శాతం మంది ఉన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి గొప్పవనరు లేదు. ప్రపంచం ఆర్థికంగా మందగమనం ఉన్నా, దేశం నిలదొక్కుకుంది. ఎంతవరకు ముందుకు వెళ్లింది అనే అంశం తర్వాత. ప్రజా జీవితంలో పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీ హయాంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చింది. కాగా సంస్కరణలు వ్యవసాయంలో ఎలాంటి మార్పును తీసుకురాలేకపోయాయి. వ్యవసాయం ప్రస్తుత పరిస్థితుల్లో సంక్షోభంలో ఉంది. ప్రభుత్వాలు వ్యవసాయంపై దృష్టి సారించాలి. రైతుకు సామర్థ్యం పెరగాలి. లేకపోతే దేశం, భావితరాలు ఇబ్బందికి గురవుతాయి. దేశంలోనూ మార్పురావాలి'' అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

2017 పాలన వైఫల్యనామ సంవత్సరం: రఘువీరా

విజయవాడ, డిసెంబరు 31: సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వంలో ప్రచారం తప్ప అభివృద్ధి శూన్యమని ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి ఆరోపించారు. 2017 పాలన వైఫల్యనామ సంవత్సరంగా ముగిసిందని ఆయన ఎద్దేవా చేశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రచారంపై ఉన్న ఆసక్తితో చంద్రబాబు మూడేళ్లుగా కోట్ల రూపాయల ప్రజాధనం వృథా చేశారన్నారు. బాబు జాబితాలో అన్నీ అపజయాలేనని, రుణ మాఫీ విషయంలో టీడీపీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. విభజన సమయం లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక హోదా హామీపై చంద్రబాబు అనేక మార్లు మాటమార్చారన్నారు. కేంద్రం నిరాకరించ డంతో చివరకు హోదా వల్ల అసలు ప్రయోజనమేలేదని చంద్రబాబు చేతులెత్తేశారన్నారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయం కూడా చంద్ర బాబు వైఫల్యాల్లో ఒకటిగా నిలిచిపోయిందన్నారు.



ప్రజాస్వామ్యం అపహాస్యం

- 2017లో విశాఖలో భూకబ్జాలు
- ఉత్సవ్‌లు చేసినా ఇమేజ్ పెరగదు: బొత్స

విశాఖపట్నం, డిసెంబరు 31 (మనం న్యూస్): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యమెందని వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2017లో విశాఖలో భూకబ్జాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయన్నారు. వీటిని కప్పి పుచ్చుకోవడానికి ఎన్ని విశాఖ ఉత్సవ్‌లను నిర్వహించినా ఇమేజ్ పెరగదని స్పష్టం చేశారు. సిట్ దర్యాప్తు ముగిసినట్లు పత్రికల్లో వచ్చిందని, నిందితుల పేర్లను బహిర్గతం చేసి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ఈ నివేదికను ప్రభుత్వం ముందు పెడితే.. నిందితులను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేసే నాయకులు టీడీపీలో ఉన్నారన్నారు. ఈ అవకాశం ఇవ్వకుండా సిట్ నివేదికను విశాఖలో బహిర్గతం చేయాలన్నారు. 2018లోనైనా ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేసి మంచి పాలనను అందించాలని కోరారు. ప్రభుత్వంతో పాటు పత్రికలు కూడా ప్రజాస్వామ్యాన్ని కాపాడటంతో కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రత్యేక హోదా కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని బొత్స స్పష్టం చేశారు. విశాఖకు రైల్వే జోన్ సాధనకు పోరాటం చేస్తామని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రిని వైసీపీ ఎంపీలు కలిసి ఈ విషయంపై చర్చించారన్నారు. టీడీపీ నేతలు పోలీసులను కూడా చేతిలో పెట్టుకుని చట్టాన్ని ఇష్టానుసారంగా మార్చేస్తున్నారని విమర్శించారు. దీంతో పోలీసులంటే భయం పోవడం వల్ల నగరంలో నేరాలు పెరిగాయని అనారు.


మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేను

- సీఎంకు కేఈ ప్రభాకర్ కృతజ్ఞతలు
- కర్నూలులో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టండి: బాబు

అమరావతి, డిసెంబరు 31 (మనం ప్రతినిధి): ఎంత మంది అడ్డుపడినా తనకే సీటు ఇవ్వడంపై ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్.. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెప్పారు. కర్నూలు స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలుపొందిన కేఈ ప్రభాకర్ ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ''కర్నూలు జిల్లాలో నాకు సీటు రాకుండా అనేక మంది అడ్డుకున్నారు. అవేమీ మీరు పట్టించుకోకుండా నా మీద ఉన్న అభిమానంతో నాకు ఎమ్మెల్సీ సీటు ఇచ్చి గౌరవించారు. మీ రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను'' అని కేఈ ప్రభాకర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేఈ ప్రభాకర్‌కు చంద్రబాబు మిఠాయి తినిపించారు. జనవరి 2 నుంచి జరిగే జన్మభూమి–మా ఊరు కార్యక్రమాలను జిల్లాలో జయప్రదం చేయాలని ఆయనకు సీఎం సూచించారు. అలాగే కర్నూలు జిల్లాలో టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

..వచ్చేస్తున్నా

- రాజకీయ పార్టీ పెడుతున్నా
- డబ్బు.. పేరు కోసం కానే కాదు
- సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రకటన



చెన్నై, డిసెంబరు 31: తాను రాజకీయాల్లోకి వచ్చేస్తున్నానని.. కొత్త రాజకీయ పార్టీ స్థాపిస్తానని.. 2021లో జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాల్లోను తమ అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రముఖ నటుడు శివాజీరావు గైక్వాడ్ అలియాస్ రజనీకాంత్ ప్రకటించారు. చెన్నై కోడంబాకం లోని రాఘవేంద్ర కళ్యాణ మండపంలో ఆరు రోజులుగా జరుగుతున్న అభిమానుల సమావేశంలో చిట్టచివరి రోజున ఆయన తన నిర్ణయాన్ని వెల్లడించారు. నిజం, పని, ఎదుగుదల అన్నవి తమ పార్టీ మూడు మంత్రాలుగా ఉంటాయని ఆయన తెలిపారు. 68 ఏళ్ల వయసు వచ్చి.. 164 సినిమాలలో నటించిన తర్వాత రజనీకాంత్ సినిమాల నుంచి రాజకీయాల్లోకి పరకాయ ప్రవేశం చేస్తున్నారు. యుద్ధం చేయబోతున్నానని, గెలుపోటములు మాత్రం భగవంతుడి చేతుల్లోనే ఉన్నాయని చెప్పారు. తనకు రాజకీయాలంటే భయం లేదు గానీ.. మీడియా అంటనే భయమన్నారు.

ఇప్పటికే డబ్బు.. పేరు

తాను డబ్బు కోసమో, పేరు కోసమో పార్టీ పెట్టడం లేదని, తనకు కావల్సినంత డబ్బు, పేరు ప్రఖ్యాతులు ఇప్పటికే ఉన్నాయని ఆయన చెప్పారు. అవి కావాలనుకుంటే తాను 1996లోనే వచ్చేవాడినని, 45 ఏళ్ల వయసులోనే అవి వద్దనుకున్నప్పుడు ఇక 68 ఏళ్ల వయసులో వాటి వెంట ఎందుకు పడతానని ప్రశ్నించారు. తాను కేవలం మార్పు కోసమే వస్తున్నానని, వ్యవస్థ మొత్తం మారాలని చెప్పారు. ప్రజాస్వామ్యం అంతా అవినీతిమయం అయిపోయిందని, దాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. తాను రాజకీయాల్లోకి రావడం అనవసరమే కావచ్చు గానీ.. రావల్సిన సమయం ఆసన్నమైందని, దీన్ని కాలమే నిర్ణయించిందని అన్నారు. తమిళ రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టిపోయాయని, కొన్ని రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలతో తమిళ ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారని రజనీ చెప్పారు. తమిళనాడును చూసి ఇతర రాష్ట్రాల వాళ్లంతా ఎగతాళిగా నవ్వుకుంటున్నారని అన్నారు. రాజకీయ నాయకుడిగా తాను ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తానని, రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాలలో తన అభ్యర్థులు పోటీ చేస్తారని స్పష్టం చేశారు. తొలిసారి గెలిస్తేనే రాజకీయాల్లో ఉంటానని, లేకపోతే పూర్తిగా రాజకీయాల నుంచి విరమించుకుంటానని కూడా ఆయన అన్నారు. తన రాజకీయ ఆరంగేట్రాన్ని కాలమే నిర్ణయించిందని తెలిపారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల గురించి ఆలోచించేంత సమయం ఇప్పుడు తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. ఇంత తక్కువ సమయంలో పోటీ చేయడం కష్టమన్నారు. అలాగే 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అన్న విషయం త్వరలోనే నిర్ణయించుకుంటానని తెలిపారు.

జీవితాంతం వెంటాడుతుంది

ఇప్పటికైనా తాను నిర్ణయం తీసుకోకపోతే, తనకు ప్రాణమిచ్చిన తమిళుల కోసం ప్రజాస్వామ్య విధానాల ద్వారా ఎలాంటి ప్రయత్నం చేయకపోతే, ఆ బాధ తనను జీవితాంతం వెంటాడుతూనే ఉంటుందన్నారు. కొత్తగా పార్టీ స్థాపించడం, అధికారంలోకి రావడం, పరిపాలన చేయడం.. ఇవేవీ అంత చిన్న విషయాలు కాదని తనకు తెలుసని.. అది సముద్రంలోంచి ముత్యం తీయడమంత కష్టమని రజనీకాంత్ చెప్పారు. ''కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన! మా కర్మ ఫలహేతుర్భూర్మాతే సంగోస్త్వ కర్మణీ!!'' అన్న గీతాశ్లోకాన్ని ఉటంకిస్తూ, మన పని మనం చేయాలని, ఫలితాన్ని భగవంతుడికి వదిలిపెట్టాలని అన్నారు. ''యుద్ధం చేయండి. గెలిస్తే దేశాన్ని పాలిస్తారు. చనిపోతే స్వర్గానికి వెళ్తారు. యుద్ధానికే వెళ్లకుండా ఆగిపోతే.. పిరికివాడని అంటారు'' అని ఆయన చెప్పినప్పుడు హాల్ అంతా కరతాళ ధ్వనులతో నిండిపోయింది.

కార్యకర్తలు కాదు.. వలంటీర్లే

రాజకీయాల్లో నిజాయితీ, సుపరిపాలన రావాల్సిన అవసరం ఉందని.. మొత్తం అంతా మారాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. చిన్న మరక కూడా లేని తెల్లటి కుర్తా పైజమా ధరించి, తన ట్రేడ్ మార్క్ బాబా గుర్తు చూపిస్తూ.. తెల్లటి గెడ్డంతో చిరుదరహాసం చేస్తూ తన నిర్ణయాన్ని రజనీ ప్రకటించారు. తనకు వలంటీర్లు కావాలి తప్ప కార్యకర్తలు కాదని చెప్పారు. బల్లల కింద చేతులు పెట్టే వ్యవహారాన్ని, బంధుప్రీతిని తాను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు. తన వలంటీర్లు స్వార్థపరమైన అవసరాల కోసం అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల వద్దకు వెళ్లకూడదని చెప్పారు. తప్పులు చేసేవాళ్లను ఈ వలంటీర్లు ప్రశ్నించాలన్నారు. ఇలాంటి స్వచ్ఛంద పరిశీలకులను పర్యవేక్షించే ప్రజాప్రతినిధిగా మాత్రమే తానుంటానని స్పష్టం చేశారు. ఇదంతా తానొక్కడినే చేయలేనని, తనకు అందరి మద్దతు.. సహకారం కావాలని కోరారు. రాష్ట్రంలో రిజిస్టర్ అయిన, రిజిస్టర్ కాని ఫ్యాన్‌క్లబ్బులన్నింటినీ ఒక తాటి మీదకు తేవడం తన మొదటి కర్తవ్యమని రజనీ చెప్పారు. అన్నివర్గాల వారిని ఈ ఫ్యాన్ క్లబ్బులలోకి తీసుకురావాలని, ఆ తర్వాత దాన్నే పార్టీగా మార్చొచ్చని సూచించారు. అప్పటివరకు తాను రాజకీయాల గురించి పెద్దగా మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయాలతో పాటు ప్రజాస్వామ్యం కూడా చాలా పాడైపోయిందని రజనీ ఆవేదన వ్యక్తం చేశారు.

నాయకుల దోపిడీ

ప్రజాస్వామ్యం పేరుతో రాజకీయ నాయకులు మన సొంత గడ్డ మీదే మనల్ని దోచుకుంటున్నారని, అందువల్ల మూలాల నుంచి మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. రాజుల కాలం నుంచి పాలకులు ఇతర దేశాలు, రాజ్యాలను దోచుకుంటూనే ఉన్నారని.. ఇప్పుడు పాలకులు తమ సొంత దేశంలోనే దోపిడీపర్వం మొదలుపెట్టారని ఎద్దేవా చే శారు. తనకిప్పుడు కార్యర్తలు వద్దని, కాపలాదారులు కావాలని తెలిపారు. తాను ఈ కాపలాదారులందరికీ అధిపతిగా ఉంటానని, ప్రతి గ్రామంలో ప్రజలందరినీ మోహరించాలని చెప్పారు. తాను అభిమానులకు అప్పగించే మొదటి పని ఇదేనన్నారు. అప్పటివరకు రాజకీయ ఊబిలోకి దూకొద్దని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సరైన సమయంలో మనం మన విధానాలు, హామీలను ప్రజలకు చెప్పాలని అన్నారు. తాను త్వరలోనే ప్రతి గ్రామంలోని ప్రతివీధికీ వస్తానన్నారు. ఇది సినిమా కాదని.. వాస్తవమని అభిమానుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. సరైన సమయంలో పార్టీని ప్రకటిస్తానన్నారు.



పుల్వామాలో ఉగ్రదాడి

- ఐదుగురు జవాన్ల వీరమరణం
- ఇద్దరు ముష్కరులు హతం.. కొనసాగుతున్న కాల్పులు


జమ్ము/శ్రీనగర్, డిసెంబరు 31: దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సీఆర్పీఎఫ్ శిక్షణ కేంద్రంపై ఇద్దరు పాక్ ఉగ్రవాదులు, మరో జైషే ముష్కర సంస్థ సభ్యుడు దాడికి దిగారు. తొలుత వీరు అండర్‌బారెల్ గ్రెనేడ్ లాంచర్లతో గేటువద్ద పహరా కాస్తున్న జవాన్లపై గ్రెనేడ్లు విసిరి, వారు తేరుకునేలోగా అత్యాధునిక తుపాకులతో కాల్పులు జరుపుతూ లోనికి చొరబడ్డారు. ఈ దాడిని జవాన్లు దీటుగా తిప్పికొట్టడంతో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఉగ్రవాది అక్కడి భవనాల్లో దాగి కాల్పులు కొనసాగించడంతో ఎదురు కాల్పులు సాగుతున్నాయి. అయితే, ఈ సంఘటనలో ఐదుగురు జవాన్లు కూడా అమరులయ్యారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించినట్లు సీఆర్పీఎఫ్ పీఆర్వో రాజేశ్ యాదవ్ తెలిపారు. శిక్షణ శిబిరంలోని మరో ఆరుగురు జవాన్లు సురక్షితంగా బయటపడ్డారన్నారు. మృతుల్లో ఒకరిని కశ్మీర్ లోయలోని నౌగామ్ ప్రాంతానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాను సైపుద్దీన్ సోజ్‌గా గుర్తించామని వెల్లడించారు. అవంతిపుర ప్రాంతంలోని లేత్‌పుర సమీపంలోని సీఆర్పీఎఫ్ కేంద్రంపై ఆదివారం తెల్లవారుజామున ఈ ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఈ ఉగ్రవాదులను సీఆర్పీఎఫ్ బలగాలు సమర్థంగా ఎదుర్కొన్నప్పటికీ వారు భారీగా ఆయుధ సామగ్రితో రావడంతో దాదాపు 11 గంటలపాటు భీకర కాల్పుల తర్వాత ఇద్దరు హతమయ్యారు. సరిహద్దులో చొరబాట్లపై మూడు రోజులనుంచీ నిఘావర్గాలు హెచ్చరిస్తున్నా ఉగ్రవాదులు ఏ మార్గంనుంచి వచ్చేదీ తెలియనందువల్ల ఈ సంఘటన చోటుచేసుకున్నదని జమ్ముకశ్మీర్ డీజీపీ వైద్ చెప్పారు. కాగా, తమ కమాండర్ నూర్ తాంత్రేను భారత భద్రత సిబ్బంది హతం చేసిన నేపథ్యంలో ప్రతీకార దాడి చేసినట్లు జైషే ప్రకటించింది. ఇక ఈ ఏడాది ఆగస్టులోనూ పుల్వామాలోని జిల్లా పోలీస్ కాంప్లెక్స్ లక్ష్యంగా ఉగ్రవాదులు ఇదే తరహాలో దాడికి దిగారు. ఈ సంఘటనలో ఎనిమిది మంది భద్రత సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

కాల్పుల విరమణకు మళ్లీ పాక్ తూట్లు

పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచింది. రాజౌరీ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి భారత బలగాలపై పాక్ సైనికులు కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం తెల్లవారుజామున రాజౌరీ జిల్లాలోని నౌషెరా సెక్టార్‌లో పాక్ ఉన్మాద చర్యకు ఒక జవాను ప్రాణాలు కోల్పోయాడు. కాగా, 2017లో పాక్ ఏకంగా 881 సార్లు సరిహద్దు వెంబడి విచక్షణరహిత కాల్పులకు తెగబడింది. ఫలితంగా 34 మంది సైనికులు, కశ్మీర్ సరిహద్దు గ్రామాల ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

కెన్యాలో ఘోర రోడ్డు ప్రమాదం

- లారీ ఢీ.. తుక్కుతుక్కయిన బస్సు
- 36 మంది ప్రయాణికులు దుర్మరణం



నైరోబీ, డిసెంబరు 31: ఆ బస్సును చూస్తే ఏదో పాత తక్కు అనుకుంటారు! కానీ అది అత్యంత విషాద ఘటన ఆనవాలు. ఓ లారీ ఢీకొట్టడంతో తుక్కుతుక్కు అయిపో యిన బస్సు అది. ఈ ఘోర ప్రమాదంలో నిద్రలో ఉండగానే 36 మంది ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరో 16 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కెన్యాలోని నకూరు–ఎల్డోరెట్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ ఘోరం జరిగింది. పశ్చిమ కెన్యాలోని బుసియా నుంచి నకూరుకు వెళ్తున్న బస్సును ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో లారీ ఢీకొట్టి ంది. దీంతో బస్సు తునాతునకలుగా మారింది. నిద్రలో ఉండగానే 36 మంది ప్రాణాలు వదిలారు. మరో 16 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంత భయానక వాతావరణం అలుముకుంది. ఇరు వాహనాల డ్రైవర్‌లతో పాటు మూడేళ్ల చిన్నారి కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో తరచూ భారీ ప్రమాదాలు జరుగుతున్నాయని, డిసెంబరు నెలలోనే 100 మంది రోడ్డు ప్రమాదాలకు బలయ్యారని పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం12.15 గంటలకు నండూరి సాంబశివరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతన డీజీపీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం మాలకొండయ్యకు ఐపీఎస్ అధికారులు, సీనియర్ అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. నండూరి సాంబశివరావు స్ఫూర్తితో పోలీసు వ్యవస్థను ముందుకు నడుపుతానని అన్నారు. అనంతరం ఆయన అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అంతకుముందు పదవీ విరమణ చేసిన డీజీపీ సాంబశివరావుకు పోలీస్ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. మంగళగిరిలోని ఆరో బెటాలియన్‌లో పోలీసు దళాల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన వీడ్కోలు సభలో మాలకొండయ్య మాట్లాడుతూ.. నండూరి సాంబశివరావు నుంచి తాను ఐదుసార్లు వివిధ స్థాయిల్లో బాధ్యతలు అందుకున్నానని చెప్పారు. తామిద్దరం ఒకే ఎస్పీ దగ్గర శిక్షణ తీసుకున్నామని తెలిపారు. సాంబశివరావు నిబద్ధత కలిగిన వ్యక్తి అని, శాంతిభద్రతల విషయంలో ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటానని పేర్కొన్నారు. నండూరి విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో సంపూర్ణంగా గడపాలని ఆకాంక్షించారు.


భావోద్వేగానికి గురైన నండూరి

వీడ్కోలు సభలో నండూరి సాంబశివరావు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను 1984లో సివిల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందానని, విధుల్లోకి చేరిన తర్వాత ప్రతి బాధ్యతను సమర్థంగా నిర్వహించానని చెప్పారు. తొలిసారి 1987లో బెల్లంపల్లిలో ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టానని, నాటి నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా.. ఎవరినీ ఒత్తిడికి గురిచేయలేదని వెల్లడించారు. 'నా 33 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా. విధి నిర్వహణలో ఎవరినీ ఎప్పుడూ ఇబ్బందులకు గురి చేయలేదు. నాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు బాలకృష్ణమూర్తి, రామకృష్ణారావులే నేను ఈ స్థాయికి చేరడానికి స్ఫూర్తి. ఏడో తరగతిలో రామకృష్ణారావు మాస్టారు చెప్పిన పాఠం నాకు యూపీఎస్సీ పరీక్షలో ప్రశ్నగా వచ్చింది. నా కుటుంబ సభ్యులు, భార్యపిల్లలు ఎంతో సహకరించారు. నాకు పదవి ఎప్పుడూ అలంకారం కాదు. నేనే పదవికి అలంకారం అనేలా పనిచేశాను. ఆర్టీసీ ఎండీగా ఉన్నప్పుడు కొన్ని కొత్త నిర్ణయాలు, మార్పులు తీసుకురావడానికి ప్రయత్నించాను' అని పేర్కొన్నారు. ఏపీ పోలీసులకు దేశంలోనే ఒక ప్రత్యేక స్థానం ఉందని నండూరి అన్నారు. దేశ స్థాయిలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కోవడంలో ఏపీ పోలీసులు ప్రత్యేక గుర్తింపు పొందరాన్నారు. సీఎం చంద్రబాబు తన మీద నమ్మకం ఉంచి కట్టపెట్టిన ప్రతి బాధ్యతను సమర్థంగా నిర్వహించానని నండూరి వివరించారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి: సీఎం

కొత్త డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన మాలకొండయ్యకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు చెప్పారు. నవ్యాంధ్రలో శాంతి భద్రతల పరిరక్షణకు మాలకొండయ్య ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తారని ఆశిస్తున్నానని ఆయన ట్వీట్ చేశారు.

మనం మూవీ 6
manammovie
అమరావతి | సోమవారం, 1 జనవరి 2018




• పవన్‌కల్యాణ్

కొడకా కోటేశ్వర్రావు.. కరుసైపోతవురో!

పవన్ కల్యాణ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఎస్.రాధాకృష్ణ నిర్మించిన చిత్రం 'అజ్ఞాతవాసి'. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ఈ చిత్రం విడుదల కానుంది. ఇది పవన్‌కల్యాణ్ నటించిన 25వ చిత్రం కావడం విశేషం. తను నటించిన కొన్ని సినిమాల్లో పాటలు పాడిన పవన్‌కళ్యాణ్ ఈ సినిమాలో కూడా ఓ పాట పాడడం విశేషం. ఈ పాటను నూతన సంవత్సర కానుకగా విడుదల చేస్తున్నట్టు ప్రకటించగానే అందరూ ఆ పాట కోసం ఎదురుచూశారు. ఆదివారం సాయంత్రం ఈ పాటను విడుదల చేశారు. 'కొడకా కోటేశ్వర్రావు.. కరుసైపోతవురో..' అంటూ సాగే ఈ పాటను పవన్ ఎంతో చలాకీగా పాడారు. పాటను రికార్డ్ చేస్తున్న విజువల్స్, లొకేషన్‌లో పాటను చిత్రీకరిస్తున్న విజువల్స్‌తో ఈ వీడియో చాలా కొత్తగా ఉంది. భాస్కరభట్ల రాసిన ఈ పాటకు అనిరుధ్ సంగీతాన్ని అందించారు. పాట మధ్యలో వచ్చే కొన్ని పదాలు చాలా ఫన్నీగా అనిపిస్తాయి. 'పులసలాగ ఎగిరి పడితే పులుసైపోతవురో..', 'మట్టయిపోతవురో.. చీపురు కట్టయిపోతవురో..' 'నువ్వు కిందపడిన ఇత్తడి బిందెకు సొట్టయిపోతవురో' అంటూ సరదాగా సాగే ఈ పాట సాగుతుంది. ఇది అభిమానులకు పవన్‌కళ్యాణ్ ఇస్తున్న నూతన సంవత్సర కానుకగా చెప్పుకోవచ్చు. చాలా తక్కువ కాలంలోనే ఈ పాట చాలా పాపులర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.


నాగ్ వెబ్ సిరీస్

మాధ్యమాలు పెరిగే కొద్దీ నటీనటులు కూడా మారిపోతున్నారు. ఒకప్పుడు వెండితెరకు మాత్రమే పరిమితమైన కొందరు నటులు ఆ తరువాత బుల్లితెర.. ఇప్పుడు వెబ్ సిరీస్ అంటూ ఏదో రకంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రానా, సాయి ధరమ్ తేజ్, సుమంత్ అశ్విన్, నవదీప్ తదితరులు వెబ్ సిరీస్‌లలో నటించగా.. తాజాగా సీనియర్ హీరోలు కూడా వాటిపై కన్నేశారు. ఇందులో భాగంగా వెంకటేష్ త్వరలోనే రానాతో కలిసి రాజీవ్ గాంధీ జీవిత కథపై తెరకెక్కబోయే వెబ్ సిరీస్‌లో నటించనున్నారు.



• నాగార్జున


తాజా సమాచారం ప్రకారం కింగ్ నాగార్జున కూడా త్వరలో ఓ వెబ్ సిరీస్‌లో నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో మంచు లక్ష్మీ నిర్మాణంలో రూపొందే వెబ్ సిరీస్‌లో నాగార్జున ఒక కీలక పాత్రలో నటించనున్నారట. ఇందులో నిజమెంతో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.



• మహేష్‌బాబు

మహేష్ @ దీపావళి

మహేష్‌బాబు ప్రస్తుతం 'భరత్ అనే నేను' చిత్రంతో బిజీగా ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 27న విడుదల కానుంది. ఈ సినిమా తరువాత వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తన తదుపరి చిత్రాన్ని చేయనున్నారు మహేష్. అశ్వనీదత్, దిల్ రాజు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా.. కథానాయకుడిగా మహేష్‌కి 25వ చిత్రం కావడం విశేషం. ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనున్న ఈ సినిమా న్యూయార్క్‌లోనే ఉంటుంది. కాగా, దీపావళి కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారని తెలిసింది.



• ప్రభాస్

సంబరాలక్కడే

'బాహుబలి' తర్వాత ప్రభాస్ చేస్తున్న సినిమా 'సాహో'తపై అందరిలో ఆసక్తి నెలకొంది. అందుకు తగినట్లుగానే ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో సినిమా షెడ్యూల్ పూర్తయ్యింది. తదుపరి షెడ్యూల్ అబుదాబిలో జరుగనుంది. అయితే లాస్ ఏంజిల్స్‌లో కొత్త సంవత్సర సంబరాలను తన స్నేహితులతో కలిసి గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు ప్రభాస్. జనవరి 4న అబుదాబి చేరుకుంటారు. 5 నుండి అక్కడ షెడ్యూల్ ప్రారంభమవుతుంది. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్ నటిస్తుంది. సుజీత్ దర్శకత్వంలో యు.వి.క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది.



• కైరా అద్వాని

చరణ్‌తో కైరా అద్వాని

రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రంగస్థలం 1985'. షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని మార్చి 30న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వంలో డి.వి.వి.దానయ్య నిర్మించే చిత్రంలో చరణ్ నటిస్తున్న విషయం తెలిసిందే.

జనవరి 19న రాస్థాన్‌లో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుంది. ఈ చిత్రంలో చరణ్ ద్విపాత్రాభినయం చేస్తారని తెలుస్తోంది. కాగా, ఈ చిత్రంలో హీరోయిన్ కైరా అద్వాని ఓకే అయినట్టు సమాచారం. ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న 'భరత్ అనే నేను' చిత్రంలో మహేష్ సరసన నటిస్తోంది కైరా అద్వాని. చరణ్ సరసన మొదట అను ఇమ్మానుయేల్ హీరోయిన్‌గా నటిస్తుందని వార్తలు వచ్చాయి. చివరికి కైరాను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.



• నిఖిల్

తదుపరి కూడా రీమేకే..

యువ కథానాయకుడు నిఖిల్ ప్రస్తుతం 'కిర్రాక్ పార్టీ' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. కన్నడ సినిమాకు ఇది రీమేక్. ఈ సినిమా తర్వాత నిఖిల్ చేయబోయే సినిమా కూడా రీమేకేనట. తమిళంలో విజయవంతమైన 'గణిదన్' సినిమా తెలుగు రీమేక్‌లో నిఖిల్ హీరోగా నటిస్తారు. ఈ సినిమాను ఠాగూర్ మధు నిర్మిస్తారు. జనవరికి 'కిర్రాక్ పార్టీ' చిత్రీకరణ దాదాపు పూర్తి అవుతుండటంతో నిఖిల్ తన తదుపరి సినిమాను సెట్స్ పైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. వినపడుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా జనవరి 19న ప్రారంభం అవుతుంది.

జనవరిలో 'హౌరా బ్రిడ్జ్'



• రాహుల్, మనాలి

ఈ ఎమ్ వి ఈ స్టూడియోస్ ప్రై.లిమిటెడ్ బ్యానర్ పై రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరీ, మనాలీ రాథోడ్ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'హౌరా బ్రిడ్జ్'. రేవన్ యాదు దర్శకుడు. ఈ సినిమాను జనవరిలో విడుదల చేస్తున్నారు. హీరో రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ ''హ్యూమన్ రిలేషన్స్ కి ఈకథ బ్రిడ్జ్‌గా ఉంటుంది. ఇందులో మరో బ్రిడ్జ్ కూడా ఉంటుంది. అది ఏంటనేది ప్రస్తుతానికి సస్పెన్స్'' అన్నారు. దర్శకుడు రేవన్ మాట్లాడుతూ ''ఇది నా రెండో ప్రాజెక్ట్. బ్రిడ్జ్ నేపథ్యంలో సాగే ఇంట్రెస్టింగ్ స్టోరీ. అందుకే హౌరా బ్రిడ్జ్ అని పెట్టాం. కథలో అనేక ట్విస్టులుంటాయి. డిఫరెంట్ స్క్రీన్ ప్లే తో మెస్మరైజ్ చేయబోతున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఈ సినిమా అందరికీ మంచి పేరు తెచ్చేదిగా ఉంటుంది. సినిమాను జనవరిలో విడుదల చేస్తున్నాం'' అని తెలిపారు.



• నివేదా థామస్



• అనుపమ పరమేశ్వరన్

ఇద్దరు కథానాయికలతో...

రామ్ కథానాయకుడిగా త్రినాథ రావు నక్కిన దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. దిల్ రాజు నిర్మించనున్న ఈ చిత్రం ఫిబ్రవరి నుంచి సెట్స్ పైకి వెళ్లనుంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో నివేదా థామస్, అనుపమ పరమేశ్వరన్ కథానాయికలుగా ఎంపికయ్యారని వార్తలు వినిపిస్తున్నాయి. రామ్, అనుపమ పరమేశ్వరన్ ఇదివరకు 'ఉన్నది ఒకటే జిందగీ' చిత్రంలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. ఇక నివేదాకి రామ్‌తో ఇదే మొదటి సినిమా. దీనికి సంబంధించిన అధికారిక సమాచారం రావాల్సి ఉంది.



• విశాల్

క్లారిటీ ఇచ్చిన విశాల్

విశాల్ హీరోగా లింగుస్వామి దర్శకత్వంలో విడుదలైన చిత్రం 'పందెం కోడి'(సండై కోళి). ఈ సినిమాకు ఇప్పుడు సీక్వెల్ 'పందెం కోడి 2' తెరకెక్కుతోంది. ఇందులో విశాల్ సరసన కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా విడుదలపై హీరో, నిర్మాత విశాల్ ఓ క్లారిటీ ఇచ్చేశాడు. సినిమాను ఏప్రిల్ 13న విడుదల చేయబోతున్నారు. ప్రస్తుతం విశాల్ హీరోగా అభిమన్యుడు(తమిళంలో ఇరుంబు తిరై) చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.




'అ!'లో కాజల్

నాని.. వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించిన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ ఫిల్మ్ 'అ!'. నిత్యా మీనన్, కాజల్, రెజీనా, ఈషా రెబ్బా, శ్రీనివాస్ అవసరాల, రోహిణి.. ఇలా భారీ తారాగణంతో ఈ సినిమా తెరకెక్కింది. ఇటీవల వరుసగా ఆ పాత్రల తాలుకూ ఫస్ట్ లుక్స్‌ని చిత్ర బ ందం విడుదల చేస్తోంది. శుక్రవారం ప్రియదర్శి, శనివారం రవితేజ వాయిస్ ఓవర్ ఇచ్చిన బోన్సాయ్ చెట్టు ఫస్ట్ లుక్‌లని విడుదల చేసిన చిత్ర యూనిట్.. ఈ రోజు (ఆదివారం) కాజల్ ఫస్ట్ లుక్ విడుదల చేసింది. గులాబి పువ్వు రేకులను తుంచేస్తూ దీనంగా కనిపిస్తున్న కాజల్‌ని చూస్తుంటే.. బహుశా ప్రేమలో భగ్నమైన అమ్మాయి పాత్రలో ఆమె కనిపించనుందని అర్థమవుతోంది. దీనికి తోడు ఆమె పోషించిన కాళీ అనే ఆ పాత్రకి 'డెసర్టెడ్ సోల్' అనే ట్యాగ్‌ని జోడించారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరిలో తెరపైకి రానుంది.

స్టార్ స్టార్.. సూపర్ స్టార్


అభిమానులకు తలైవా.. ఆయనకు అభిమానులే దేవుళ్లు



రజనీకాంత్ జీవితం కష్టసుఖాల కలబోత. ఆయన మధ్యతరగతిలో కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు ఇద్దరూ మహారాష్ట్రకు చెందినవారైనా ఉద్యోగరీత్యా బెంగుళూరులో నివాసం ఉండేవారు. రజనీకాంత్ తండ్రి శివాజీరావు గైక్వాడ్ పోలీస్ కానిస్టేబుల్. రజనీకి ఐదేళ్లు వయసు ఉన్నప్పుడు తల్లి మరణించారు. అక్కడినుంచి రజనీ జీవితంలో కష్టాలు మొదలయ్యాయి.

• ప్రారంభంలో విలనీ.. ఆపై హీరో

చెన్నై, డిసెంబరు 31: ''నేను కోలుకోవాలని ప్రార్థించిన.. పూజలు చేసిన అభిమానులకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. నేను మొదట దేవుడికి ధన్యవాదాలు చెప్పాల్సింది. కానీ.. నా అభిమాన దేవుళ్లకు నమస్కరిస్తున్నాను!!'' మొన్నామధ్య సింగపూర్లో కిడ్నీ సంబంధిత వ్యాధిని జయించి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యేముందు రజనీ చేసిన వ్యాఖ్యలివి.. సూపర్‌స్టార్‌కు దేశవిదే శాల్లో అభిమానులు ఉన్నారనే విషయం తెలిసిందే! రజనీ అంటే వారికి అంతా ఇంతా అభిమానం కాదు.. ఆయనను 'తలైవ'(నాయకుడు) అని పిలుచుకునేంత! అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరితే ఉపవాసాలతో గుడులు గోపురాలలో పూజలు చేసేంత! ఆయన ఆరోగ్యం బాగుపడితే తలనీలాలిస్తామని మొక్కుకునేంత! ఈ అభిమానాన్ని, తనంటే వాళ్లకున్న ఆప్యాయతనూ కాపాడుకోవడ మూ రజనీకి తెలుసు. అందుకే ఆరోగ్యం బాగుపడి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే ముందు ఆయన తన అభిమానులకు ధన్యవాదాలు చెప్పారు.





స్నేహితుడి సాయంతో..

కండక్టర్‌గా పనిచేస్తూనే చేసిన 'కురుక్షేత్ర' నాటకంలో దుర్యోధనుడి వేషం రజనీకి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. నటనపట్ల రజనీకాంత్‌లోని ఆసక్తిని గమనించిన స్నేహితుడు రాజా బహదూర్ మద్రాసు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో చేర్పించారు. దానికైన ఖర్చంతా ఆయనే భరించారు. తదనంతర కాలంలో హీరోగా నిలదొక్కుకున్నాక.. వీరిద్దరి స్నేహానికి ప్రతీకగా తమిళంలో 'ఒరు వజి శాలై', కన్నడలో 'వన్ వే రోడ్' చిత్రాలు రూపొందించారు. స్టయిలిష్ ట్రెండ్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఈ లెజెండరీ హీరో.. ఈరంకి శర్మ దర్శకత్వంలో రూపొందిన 'చిలకమ్మ చెప్పింది' పూర్తి స్థాయి హీరోగా నటించారు. అటుపై వరుసగా సినిమాలు చేస్తూ తమిళ్, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ వంటి ఏడు భాషల్లో 160కిపైగా చిత్రాల్లో నటించారు. రజనీ తొలి కామెడీ చిత్రం 'తిల్లు ముల్లు'. హిందీలో వచ్చిన 'గోల్ మాల్' చిత్రానికిది రీమేక్. ఈ చిత్రం తర్వాత యాక్షన్ హీరోగా టర్న్ తీసుకుని 'నల్లవనుకు నల్లావన్'(1984) చిత్రంలో నటించారు. ఎస్పీ ముత్తురామన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతోపాటు ఉత్తమ నటుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డునందుకున్నారు. ఎన్టీఆర్‌తో కలిసి నటించిన 'టైగర్' ఆయనకు యాభైవ చిత్రం. 1983లో బాలీవుడ్‌లోకి అరంగేట్రం చేశారు. అమితాబ్‌బచ్చన్, హేమామాలినిలతో కలిసి 'అంధ కానూన్' చిత్రంలో నటించారు. ఈ చిత్రం భారీ వసూళ్ళని సాధించింది. దీని తర్వాత 'గిరఫ్తార్', 'హమ్' చిత్రాల్లో నటించారు. అయితే, మరాఠకు చెందిన ఫ్యామిలీ అయినప్పటికీ రజనీ ఇప్పటివరకు ఒక్క మరాఠి చిత్రంలోకూడా యాక్ట్ చేయలేదు. నలభై ఏళ్ళ సినీ కెరీర్‌లో 5 విజయ అవార్డులు, 9 తమిళనాడు స్టేట్ అవార్డులు గెలుచుకున్నారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు గానూ ప్రభుత్వం 2000 సంవత్సరంలో పద్మభూషణ్ అవార్డుతో సముచితంగా గౌరవించింది.


బాలచందర్‌తో అనుబంధం..

రజనీలోని నటుడిని గుర్తించి, సినిమా అవకాశం ఇచ్చిన దర్శకుడు బాలచందర్.. రజనీ ఇచ్చిన ఓ రంగస్థల ప్రదర్శన బాలచందర్ కంట్లో పడింది. రజనీని కలిసిన బాలచందర్.. తమిళం నేర్చుకోమని సలహా ఇచ్చారు. ఈ సలహాను రజనీ వెంటనే అమలుపరిచారు. అటుపై అపూర్వ రాగాంగళ్ సినిమాలో కేన్సర్ పేషెంట్ పాత్రకు రజనీని ఎంపిక చేసుకున్నారు బాలచందర్. ఆ తర్వాత మరో సినిమాలో కూడా రజనీకి బాలచందర్ అవకాశం ఇచ్చారు. ఆ రెండు సినిమాలు భారీ హిట్ కావడంతో రజనీకాంత్ వెనక్కు తిరిగిచూసుకోవాల్సిన పనిలేకుండా పోయింది. తర్వాత బాల చందర్ తెలుగులో దర్శకత్వం వహించిన అంతులేని కథలోనూ రజనీకి అవకాశం ఇచ్చారు. రజనీ-బాలచందర్ కాంబినేషన్‌లో వచ్చిన పలు సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. సినీ రంగంలో తనకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించిన బాలచందర్ అంటే రజనీకి ప్రత్యేక అభిమానం, గౌరవం.. సినిమాల గురించి అనేక విషయాలు ఆయన వద్దే నేర్చుకున్నానని రజనీ చెబుతుంటారు.అయితే, రజనీ గురించి చెబుతూ.. 'సినిమా ఇండస్ట్రీకి నేను పరిచయంచేసిన రజనీకాంత్ వేరు.. ఇప్పుడు కనిపించే రజనీ వేరు! ఒక్క అవకాశం ఇచ్చి చూశా.. తన స్వయంకృషి, ప్రతిభ, పట్టుదలతో ఇంత స్థాయికి ఎదిగారు' అని బాలచందర్ అంటుంటారు.

రాజకీయాల్లో ప్రచారం..

1995లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావుతో భేటీ తర్వాత రజనీకాంత్ కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వడం ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ వచ్చారు. పలు రాజకీయ పార్టీల తరపున గతంలో రజనీకాంత్ చేసిన ప్రచారం కొన్నిచోట్ల విజయం సాధించిపెట్టగా.. మరొకొద్ది చోట్ల ఫ్లాప్ షోగా మారింది. 1996 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే-టీఎంసీ కూటమి గెలుపునకు కారణం రజనీకాంతే. 'జయలలిత మళ్లీ ముఖ్య మంత్రి అయితే త మిళనాడును దేవుడు కూడా రక్షించలేడు' అనే స్టేట్‌మెంట్‌ను రజనీ కాంత్ ఎన్నికల ప్రచారంలో వినియోగించారు. ఆ తర్వాతి ఎన్నికల్లో డీఎంకే-బీజేపీ కూ టమి తరపున రజనీ మళ్లీ ప్రచారం చేసినా ఫలితాలు నిరాశకు గురిచేశాయి. 39 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగగా.. కేవలం తొమ్మిది చోట్ల మాత్రమే డీఎంకే-బీజేపీ కూటమి విజయం సాధించింది. 2004 లోక్‌సభ ఎన్నికల్లో పీఎంకేకు వ్యతిరేకంగా ఓట్లు వేయాలని రజనీ ప్రజలను కోరినా ఫలితం తలకిందులైంది. ఈ ఎన్నికల్లో పీఎంకే పోటీ చేసిన అన్నిచోట్లా గెలుపొందింది.

రజనీ రాజకీయ ప్రకటన చేయగానే ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బాలీవుడ్, దక్షిణాది సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎవరేమన్నారంటే..



'నా స్నేహితుడు, సహ నటుడు, మానవతావాది రజనీకాంత్ రాజకీయాల్లోకి రావాలని నిర్ణయం తీసుకున్నారు. ఆయన విజయం సాధించాలని కోరుతూ శుభాకాంక్షలు చెబుతున్నా'

– బిగ్ బీ అమితాబ్ బచ్చన్



'నా సోదరుడు రజనీకాంత్ సామాజిక బాధ్యతకు, రాజకీయ అరంగేట్రానికి స్వాగతం పలుకుతున్నా'

– కమల్ హాసన్



'2017 సంవత్సరం చివరి రోజు పెద్ద సంచలనం. రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నారు. జై హో'

– అనుపమ్ ఖేర్



'రజనీకాంత్‌కు స్వాగతం, తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు'

– కృష్ణంరాజు

రాంగోపాల్ వర్మ, రితేశ్ దేశ్‌ముఖ్, ఖుష్బూ, రాఘవ లారెన్స్ తదితరులు రజనీకాంత్‌కు శుభాకాంక్షలు చెప్పారు.

నిరక్షరాస్యుడు, అవినీతిపరుడు

'రజనీకాంత్ నిరక్షరాస్యుడు. అవినీతి పరుడు. ఆయన మనకు ఏం చెబుతారు? ఇది పాత కథ మాత్రమే. మరో తమిళ నటుడు రాజకీయాల్లో వచ్చారు. నేనెప్పుడూ రజనీకాంత్‌ను వ్యతిరేకిస్తాను. ఆయన రాజకీయ ప్రవేశం మీడియా మితిమీరిన ప్రచారమే. రజనీ ఇంకా రాజకీయ పార్టీని ప్రకటించలేదు. తమిళనాడులో సినీ తారలందరూ రాజకీయాల్లోకి వచ్చి సవారీ చేస్తారనే భావన నెలకొంది. అనువుకాని సమయం, ప్రాంతంలో రజనీ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన ఆందోళన చెందాల్సి ఉంటుంది. ఎందుకంటే రజనీ బ్లాక్‌మనీపై విచారణ వెలుగు చూస్తుంది. రజనీ అభిమాన సంఘాల పాటలకు, నృత్యాలకు తమిళులు ఆకర్షితులు కారు. అభిమానుల సంఘం రాజకీయ పార్టీ కాలేదు'

– బీజేపీ ఎంపీ సుబ్రమణ్య స్వామి

ఎంజీఆర్, అమ్మలతో ఎవరినీ పోల్చలేం: దినకరన్

చెన్నై, డిసెంబరు 31: రజనీకాంత్ పొలిటికల్ ఎంట్రీని లైట్ తీసుకున్నారు అన్నాడీఎంకే బహిష్కృ త నేత టీటీవీ దినకరన్. 'ఒక్కడే ఎంజీఆర్, ఒక్కరే అమ్మ.. వాళ్లతో ఎవరినీ పోల్చలేం. ఏ కొత్త మొహం కూడా అమ్మ మద్దతుదారుల మనసు గెలుచుకోలేరు' అని దినకరన్ స్పష్టంచేశారు. విజయ్‌కాంత్ కూడా పార్టీ పెట్టారని, ఆయన పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసన్నారు. అయితే ప్రతి ఒక్కరికీ పార్టీ పెట్టుకునే హక్కు ఉందన్నారు. జయలలిత స్థానమైన ఆర్కే నగర్ నుంచి దినకరన్ బంపర్ మెజార్టీతో గెలిచిన విషయం తెలిసిందే. రజనీకాంత్ ప్రభావం ఎంతుంటుందో ఎన్నికలలో ప్రజలే తేలుస్తారని చెప్పారు.

ఆయన జీవితమే పోరాటం

అట్టడుగు స్థాయినుంచి శిఖరాగ్రానికి..



న్యూఢిల్లీ, డిసెంబరు 31: 'జీవితమంటే పోరాటం.. పోరాటంలో ఉంది జయం' అన్న పాటకు రజనీ జీవితమే ఓ పెద్ద ఉదాహరణ! ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రజనీ 'ఎక్కు తొలిమెట్టు.. గట్టిగ పట్టే నువు పట్టు గమ్యం చేరేట్టు' అన్న మాటలను అక్షరాలా ఆచరించి చూపారు. కర్నాటకలో స్థిరపడ్డ మరాఠీ కుటుంబంలో 1950 డిసెంబరు 12న జన్మించారు. సాధారణ బస్ కండక్టర్‌గా జీవితం ప్రారంభించి అత్యధిక పారితోషికం అందుకునే సూపర్ స్టార్‌గా ఎదిగేందుకు ఈ పట్టుదలే తోడ్పడింది. నచ్చిన రంగంలో కృషి, పట్టుదలతో ఉన్నతస్థానానికి ఎదగవచ్చని ఆయన నిరూపించి, ఆదర్శనీయంగా నిలిచారు. స్క్రీన్‌పై అద్భుతమైన ప్రదర్శనతో అంతర్జాతీయంగా అభిమానులను సంపాదించుకోవడంతో పాటు పద్మ భూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. బస్ కండక్టర్ స్థాయి నుంచి సూపర్ స్టార్‌గా ఎదిగి ప్రస్తుతం రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న రజనీకాంత్ జీవితంలోని కొన్ని ముఖ్య విశేషాలు..


- రజనీ అసలు పేరు శివాజీరావు గైక్వాడ్.. చిన్నతనంలో మరాఠీ, కన్నడ భాషలను మాట్లాడుతూ ఎదిగారు.
- సినిమాల్లోకి రాకముందు కొంతకాలం కూలీగా, కార్పెంటర్‌గా అటుపై కండక్టర్‌గా పనిచేశారు.
- మద్రాస్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ నుంచి నటనలో డిప్లొమా చేశారు.. అదే సమయంలో తమిళం కూడా నేర్చుకున్నారు.
- రజనీ కన్నా ఆయన జీవిత భాగస్వామి లతారంగాచారి ఎనిమిదేళ్లు చిన్న.. కాలేజ్ మ్యాగజైన్ కోసం రజనీ ఇంటూర్వ్యూ తీసుకునే క్రమంలో వారిద్దరు మొదటిసారి కలుసుకున్నారు. ఆ స్నేహం పెరిగి 1981లో వివాహబంధంతో వారిరువురూ ఒక్కటయ్యారు. రజనీ సినిమాలతో బిజీ బిజీ.. లత చెన్నై కేంద్రంగా 'ది ఆశ్రమ్' పేరుతో ఓ స్కూలును నడుపుతున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఐశ్వర్య, సౌందర్య.
- కెరీర్ తొలినాళ్లలో రజనీ విలన్‌గా చేశారు. సుమారు రెండేళ్ల పాటు భార్యను వేధించే భర్తగా, ఓ రేపిస్ట్‌గా, స్త్రీలోలుడిగా తదితర నెగెటివ్ వేషాలు వేయాల్సివచ్చింది. అయితే, 1977లో 'భువన ఒరు కెల్విక్కురి' సినిమాతో రజనీ తొలిసారి పాజిటివ్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు.
- హిందీలో అమితాబ్ నటించిన దీవార్, అమర్ అక్బర్ ఆంటోని, లావారీస్, డాన్ తదితర 11 సినిమాల తమిళ రీమేక్‌లో రజనీ హీరోగా నటించారు.
- 2007లో బ్లాక్ బ్లస్టర్‌గా నిలిచిన 'శివాజీ' చిత్రానికిగానూ రజనీ అందుకున్న పారితోషికం రూ.26 కోట్లు.. దీంతో ఆసియా వ్యాప్తంగా జాకీచాన్ తర్వాత అత్యధిక పారితోషికం అందుకునే నటుడిగా రజనీ నిలిచారు.
- రజనీ పెద్ద కూతురు ఐశ్వర్య, హీరో ధనుష్‌ను పెళ్లాడారు. చిన్న కూతురు సౌందర్య పారిశ్రామికవేత్త అశ్విన్ రాంకుమార్‌ను వివాహం చేసుకున్నారు.












పండుగ చేసుకున్నారు

రజనీ రాజకీయ ప్రవేశంపై అభిమానుల సంబరాలు



చెన్నై, డిసెంబరు 31: రెండు దశాబ్దాలుగా నెల కొన్న సస్పెన్స్ వీడింది. అభిమానుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. దేవుడు శాసిస్తే.. అంటూ ఊరించిన తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌ను దేవుడు ఎట్టకేలకు శాసించాడు. రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించేశారు. దీంతో ఓ రోజు ముందే ఆయన అభిమానులకు కొత్త ఏడాది వచ్చింది. ఆదివారం తమిళనాట పండుగ వాతావరణం నెలకొంది. రజనీ రాజకీయ ప్రకటన వెలువడగానే రాష్ట్రవ్యాప్తంగా అభిమానులు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచి సంతోషం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రాంతాలలో, బస్సులు, రైళ్లలోని ప్రయాణికులకు స్వీట్లు పంచారు. బాణాసంచా పేల్చి కోలాహలం చేశారు. తలైవా (నాయకుడు) కొత్త ఏడాది కానుక ఇచ్చారంటూ పొంగిపోయారు. తమిళనాడులో రజనీ మెగా సైజు పోస్టర్లు వెలిశాయి. 31న రాజకీయ ప్రవేశంపై తన వైఖరి వెల్లడిస్తానని రజనీ ప్రకటించడంతో.. తమిళులు ఆసక్తిగా ఆయన నిర్ణయం కోసం ఎదురు చూశారు. చెన్నైలోని వేదిక రాఘవేంద్ర కల్యాణ మంటపం వద్దకు పెద్దసంఖ్యలో అభిమానులు చేరుకున్నారు. రజనీ రాజకీయ ప్రకటన చేశాక మంటపం బాల్కనీలోకి వచ్చి బయట ఉన్న అభిమానులకు అభివాదం చేశారు. అంతే... అభిమానులు తలైవా అని బిగ్గరగా అరుస్తూ హోరెత్తించారు. నృత్యాలు చేస్తూ సంబరాల్లో మునిగిపోయారు.





S & D



యువకులు గర్వకారకులు

భారత టెన్నిస్‌లో పెరుగుతున్న ఆశాకిరణాలు

(క్రీడావిభాగం)

సింగిల్స్‌లో టాప్ ప్రత్యర్థులపై యువ ఆటగాళ్లు సంచలన విజయాలు సాధించడం భారత టెన్నిస్‌కు ఎనలేని బలాన్నిచ్చింది. ఈ ఏడాది రోహన్ బోపన్న గ్రాండ్ శ్లామ్ టైటిల్ గెలిచాడు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా భారత టెన్నిస్ అంత గొప్పగా కానీ అంత దిగజారుడుగా కానీ లేదు. మధ్యస్తంలో వేలాడుతోంది. కానీ యువకులు స్ఫూర్తిదాయక ఆటను ప్రదర్శించడం హర్షించదగ్గ విషయం. యుకీ భాంబ్రీ, రామ్‌కుమార్ రామనథాన్, సుమిత్ నాగాల్ తమ ఆటను తామే సవాల్‌గా తీసుకుని క్రీడాస్ఫూర్తితో విజయాలు సాధించారు. స్థిరంగా రాణిస్తూ, తమ శక్తిసామర్థ్యాలను గుర్తించిన వీరికి మరికొంత ప్రోత్సాహం అవసరం. కానీ దురదృష్టవశాత్తు అడ్మినిస్ట్రేటర్ల ప్రాధాన్యత లోపం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఏడాది సీజన్ అంతటిలో భారత్ రెండు చాలెంజర్ ఈవెంట్లకు మాత్రమే ఆతిథ్యమిచ్చింది. గత నెలలో ఒకటి పుణెలో, రెండో బెంగళూరులో జరిగాయి. పుణె చాలెంజర్‌లో యుకీ, బెంగళూరు చాలెంజర్‌లో నాగాల్ విజేతలుగా నిలిచారు. దీంతో వీరి ర్యాంకింగ్స్‌లో భారీ మార్పు చోటు చేసుకుంది. గాయాల నుంచి కోలుకున్న యుకీ ఈ ఏడాది 500లోపు ర్యాంక్‌తో ఈ ఏడాదిని ప్రారంభించాడు. స్థిరమైన ఆట తీరుతో సింగిల్స్‌లో 114 ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇక 356వ ర్యాంక్‌తో ఈ ఏడాదిని ప్రారంభించిన నాగాల్ బెంగళూరు ఓపెన్ విజయం తర్వాత 90 స్థానాలు మెరుగుపరచుకుని ప్రస్తుతం 223వ ర్యాంక్‌లో ఉన్నాడు. పుణె ఫైనల్లో ఇద్దరు భారత టాప్ సింగిల్స్ ప్లేయర్స్ తలపడ్డారు. 142వ ర్యాంక్ ఆటగాడు రామ్‌కుమార్ ఫైనల్లో యుకీ చేతిలో ఓటమిపాలయ్యాడు. అయితే ఏడాదికి కనీసం ఐదు చాలెంజర్ టోర్నీలు నిర్వహించేందుకు ఏఐటీఏ ఎందుకు నిధులు సమీకరించడం లేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. భారత్‌లో టెన్నిస్‌కు నిధులు సమీకరించడం చాలా కష్టం. కానీ ఎమ్ఎస్ఎల్ టీఏ నిరంతరాయంగా కార్పొరేట్, ప్రభుత్వం మద్దతుతో నిధులను సమీకరిస్తోంది. మెన్స్ చాలెంజర్, డబ్ల్యూటీఏ టోర్నీ, ఫిబ్రవరిలో న్యూజిలాండ్‌తో డేవిస్ కప్ కాకుండా ఎమ్ఎస్ఎల్ టీఏ ఆరు మహిళల ఈవెంట్లను నిర్వహించింది. అంతేకాకుండా దేశంలో ఐటీఎఫ్ పురుషుల ఫ్యూచర్స్ (ఎంట్రీ లెవెల్) టోర్నీలు తొమ్మిది, ఐటీఎఫ్ మహిళల టోర్నీలు ఆరు ఉన్నాయి.

ప్లేయర్స్ అవసరాలపై ఏఐటీఏ మూగనోము పాటిస్తోంది. అప్పడప్పుడు క్రీడా మంత్రిత్వ శాఖతో సమావేశాలు తప్ప నిధులను డిమాండ్ చేయలేకపోతోంది. టోర్నీలను నిర్వహించుకునేందుకు ఏఐటీఏనే నిధులు సమీకరించుకోవాలని మంత్రిత్వ శాఖ చెబుతోంది. అంతగా మద్దతు, టోర్నీలు లేకపోయినప్పటికీ యువకులు దేశానికే గర్వకారణంగా నిలుస్తున్నారు. యూఎస్‌లో జరిగిన ఏటీపీ సిటీ ఓపెన్‌లో ప్రపంచ 22వ ర్యాంక్ ప్లేయర్ గెయిల్ మోన్‌ఫిల్స్‌కు యుకీ షాకిచ్చాడు. అలాగే టర్కీలో జరిగిన అంటల్యా ఓపెన్‌లో ప్రపంచ 8వ ర్యాంక్ ప్లేయర్ డొమినిక్ థీమ్‌ను రామ్ కుమార్ ఓడించాడు. అలాంటి ప్రతిభను వాళ్లు మళ్లీ కనబరచలేదు కాదా అనే వాదన రావచ్చు. కానీ టాప్-50లోపు ర్యాంక్ సాధించే సత్తా తమకుందని వారు నిరూపించారు. వాళ్లకు సరైన మద్దతిస్తే.. ఫిజియోలు, కోచ్‌లను వారికి ఏర్పాటు చేస్తే అంతకంటే మెరుగైన ప్రతిభను వారు కనబరిచే అవకాశముంది.

మొన్నటి వరకు లియాండర్ పేస్, మహేశ్ భూపతిల నీడలో ఆడిన రోహన్ బోపన్న ఈ ఏడాది తన ప్రత్యేకతను నిరూపించుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కెనెడాకు చెందిన గాబ్రియేలా డబ్రోవ్‌స్కీతో కలిసి టైటిల్ గెలిచాడు. దీంతో గ్రాండ్ శ్లామ్ టైటిల్ గెలిచిన భారత నాలుగో ఆటగాడిగా బోపన్న ఘనత సాధించాడు. అంతేకాకుండా మాంటే కార్లో మాస్టర్స్‌తో కలిపి మూడు ఏటీపీ టైటిళ్లు గెలవడంతో డబుల్స్ ప్లేయర్స్ ర్యాంకింగ్స్‌లో స్థిరంగా టాప్-20లో కొనసాగుతున్నాడు. చడీ చప్పుడు లేకుండా దూసుకెళ్లుతున్న మరో ఆటగాడు దివిజ్ శరణ్. ఢిల్లీకి చెందిన ఇతను ప్రస్తుతం డబుల్స్‌లో 47వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. దేశంలోనే అత్యధిక ర్యాంక్ కలిగిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ఎప్పటిలాగే పురవ్ రాజాతో కలిసి బరిలోకి దిగిన దివిజ్ అద్భుతమైన ప్రతిభను కనబరిచాడు. చాలెంజర్ సర్క్యూట్‌లో రెండు టైటిళ్లు, రెండు రన్నరప్ టైటిళ్లు గెలవడంతో పాటు ఏటీపీ యూరోపియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు.

2015, 2016లలో మార్టినా హింగిస్‌తో కలిసి మహిళల డబుల్స్‌లో టాప్ ర్యాంక్‌లో కొనసాగిన హైదరాబాద్ స్టార్ ప్లేయర్ సానియా మీర్జా నంబర్ వన్‌ను కోల్పోవడమే కాకుండా సీజన్ చివర్లో టాప్-10 ర్యాంక్‌ను కోల్పోయింది. హింగిస్‌తో విడిపోయిన సానియాకు షువాయ్ పెంగ్‌తో సెటిలయ్యే వరకు రెగ్యులర్ భాగస్వామి కోసం ఇబ్బంది పడింది. పెంగ్‌తో కలిసి సానియా యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్ వరకు ఆడింది. ఈ సీజన్‌లో ఎనిమిది మంది భాగస్వాములను మార్చిన 31 ఏళ్ల సానియా ఈ ఏడాది ఒక్క గ్రాండ్ శ్లామ్ టైటిల్ కూడా గెలవలేదు.

ప్రస్తుతం మోకాలి గాయంతో బాధపడుతున్న ఆమె త్వరలో జరగనున్న ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరమైంది. వర్ధమాన ప్లేయర్స్ జీల్ దేశాయ్, కర్మన్ కౌర్ థండిపైనే భారత్ ఆశలు పెట్టుకుంది. అంకిత రైనా స్థిరంగా ఆడుతోంది. భారత సీనియర్ ఆటగాడు లియాండర్ పేస్ 44 ఏళ్ల వయసులోనూ సత్తా చాటుతున్నాడు. రెండు చాలెంజర్ స్థాయి టైటిళ్లతో ఈ ఏడాది సీజన్‌ను ముగించాడు. ఏది ఏమైనా సీనియర్లు తెరమరుగవుతున్న సమయంలో యువకులు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారు.



చిందేసిన కోహ్లీ, ధావన్

కేప్‌టౌన్ : టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, ఓపెనర్ శిఖర్ ధావన్‌లు కేప్‌టౌన్ వీధుల్లో చిందేశారు. దక్షిణాఫ్రికాతో జనవరి 5 నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టు నేపథ్యంలో ఈ స్టార్ క్రికెటర్లు కేప్‌టౌన్ నగరంలో ఫ్యామిలీతో చక్కర్లు కొడుతూ సరదాగా గడుపుతున్నారు. కేప్‌టౌన్ వీధుల్లో జనసమూహం మధ్యలో కొందరు డ్రమ్స్ వాయిస్తుండగా.. ఏ మాత్రం వెనకడుగు వేయకుండా కోహ్లీ, ధావన్‌లు డ్యాన్స్ చేశారు. తొలి టెస్టుకు చీలమండ గాయంతో ధావన్ దూరమైన విషయం తెలిసిందే. దీంతో మురళి విజయ్ లేదా కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నారు. వర్షం అంతరాయం కలిగించడంతో ఆదివారం భారత క్రికెటర్ల ప్రాక్టీస్ సెషన్‌ను న్యూలాండ్ క్రికెట్ స్టేడియంలోని ఇండోర్ గ్రౌండ్‌కు తరలించారు.



వచ్చిన అవకాశాన్ని పాండ్య ఒడిసిపట్టుకున్నాడు: ద్రవిడ్



న్యూఢిల్లీ: ప్రస్తుత భారత క్రికెట్ జట్టులో నెలకొన్న పోటీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. జట్టులోకి ఒకసారి వచ్చిన ప్రతీ ఆటగాడు అందివచ్చిన అవకాశాన్ని వదలడం లేదు. ప్రతి ఒక్కరు మంచి ప్రదర్శనతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పర్చుకుంటున్నారు. దీంతో ప్రధాన ఆటగాళ్ల స్థానానికి కూడా గ్యారంటీ లేకుండా పోతుంది. ఒక సారి గాయంతో జట్టులోనుంచి వెళ్లి పోయిన తిరిగి జట్టులో చోటు దక్కించుకోవడం అంత సులువైన పని కాదు. ప్రతి ఒక్కరి స్థానానికి తీవ్రంగా కాంపిటీషన్ ఉంది. ఇలాంటి సమయంలో జట్టు ఎంపిక భారత సెలక్టర్లకు పెద్ద సవాల్‌గా మారుతుంది. ఇలానే భారత జట్టులోకి వచ్చి రెగ్యులర్ ఆటగాళ్లగా మారిపోయిన జాబితాలో ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య ముందు వరుసలో ఉన్నాడు. అయితే హార్దిక్ ప్రతిభను గుర్తించడంలో భారత-ఎ, అండర్-19 జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ పాత్ర ముఖ్యమైంది. ఈ యువ ఆల్‌రౌండర్ హార్దిక్ టీమిండియాలో రావడానికి ముఖ్య కారణం ద్రవిడే. ఇతని సిఫార్సు వల్లనే పాండ్య జట్టులోకి వచ్చాడనడానికి సందేహంలేదు. పాండ్య ఎదుగుదలలో, మానసిక పరిణితి సాధించడంలో ద్రవిడ్ పాత్ర ఎంతైనా ఉంది. హార్దిక్ తన సామర్థ్యంతోనే జట్టులోకి వచ్చాడు. అతను చక్కని ప్రదర్శనలు ఇవ్వగలడని, అతను జట్టులో ఒక ఎక్స్ ఫ్యాక్టర్‌గా కనిపిస్తాడని ద్రవిడ్ అన్నాడు. అంతకుముందు సెలక్షన్ కమిటీతో సమావేశం అయినప్పుడు ఏం జరిగిందో ద్రవిడ్ వివరించాడు. నేను భారత-ఎ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు భవిషత్తు కోసం ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్‌ను వెతకాల్సిన ఆవశ్యకత ఉంది. విజయ్ శంకర్, స్టువర్ట్ బిన్నీ ఆ పాత్రలు పోషించారు. తర్వత శంకర్ గాయపడడంతో హార్దిక్ పాండ్యకు ఆవకాశం వచ్చింది. అంది వచ్చిన ఆవకాశాన్ని పాండ్య రెండు చేతులా ఒడిసిపట్టుకున్నాడు. ఆస్ట్రేలియా సిరీస్‌లో భాగంగా వచ్చిన ఆవకాశంలో బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లో కూడా సత్తా చాటుకున్నాడు. బ్రిస్బేన్ టెస్ట్‌లో 46 పరుగులకే 6 వికెట్లు తీయడమే కాకుండా బ్యాటింగ్‌లో కూడా 79 పరుగులు చేసి ఆలౌరౌండర్‌గా ఆకట్టుకున్నాడు. అలా టీమిండియాకు ఎంపికయ్యాడని ద్రవిడ్ పేర్కొన్నాడు.



లోధా కమిటీ నిబంధనలకు ఓకే!

పుణె: క్రికెట్ పరిపాలనలో జస్టిస్ ఆర్ఎం లోధా కమిటీ ప్రతిపాదించిన అన్ని సంస్కరణలను అమలు చేయనున్నట్టు మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) తెలిపింది. శుక్రవారం జరిగిన ప్రత్యేక పరిపాలనా కమిటీ సమావేశంలో సంస్కరణల అమలుకు తలూపింది. 'సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్ర క్రికెట్ సంఘం లోధా కమిటీ సంస్కరణలు అమలు చేసేందుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సభ్యులందరూ తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సంస్కరణలకు ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను' అని ఎంసీఏ అధ్యక్షుడు అభయ్ ఆప్టే పేర్కొన్నారు. ఈ సమావేశానికి సుప్రీం కోర్టు ఉద్వాసన పలికిన బీసీసీఐ మాజీ కార్యదర్శి అజయ్ షిర్కే హాజరయ్యారని తెలిసింది. ఎంసీఏలో షిర్కే సభ్యుడు కాబట్టి సమావేశాలకు హాజరయ్యే అధికారం ఆయనకు ఉంటుందని మరో సభ్యుడు తెలిపారు. సుప్రీం ఆదేశాల అనుసరం ఒక్కొక్క అనుబంధ సంఘం లోధా సంస్కరణలకు అంగీకరిస్తున్నాయి. నిధులు విడుదల చేయకుండా అడ్డుకోవడంతో అవి ఒత్తిడికి తలొగ్గుతున్నాయి. ఉక్కిరిబక్కిరి అవుతున్నాయి. బీసీసీఐ మాత్రం కొన్ని నియమాలను వ్యతిరేకిస్తోంది. ఒక రాష్ట్రానికి ఒక ఓటు, పాలకులకు వయో పరిమితి విధింపు, ఒక వ్యక్తికి ఒక పదవి, రెండు పదవుల మధ్య కూలింగ్ ఆఫ్ పీరియడ్ అంశాలను ఒప్పుకోవడం లేదు.

అక్షయ్ వాడ్కర్ అజేయ సెంచరీ

భారీ ఆధిక్యంలో విదర్భ

ఢిల్లీతో రంజీ ట్రోఫీ ఫైనల్

ఇండోర్: అక్షయ్ వాడ్కర్ అజేయ సెంచరీతో చెలరేగడంతో ఇక్కడ ఢిల్లీతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భ భారీ ఆధిక్యం సాధించింది. గత నెలలోనే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన విదర్భ వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తన తొలి సెంచరీని నమోదు చేసుకున్నాడు. ఇతను ఆదిత్య సార్వేతే (79)తో కలిసి ఏడో వికెట్‌కు కీలకమైన 169 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆదివారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి అక్షయ్ (133) పరుగులు చేసి అజేయంగా క్రీజులో ఉన్నాడు. మరోవైపు ఇతనికి అండగా ఉన్న సిద్ధేశ్ నెరల్ (56 నాటౌట్)గా ఉన్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 528/7 పరుగులు చేసింది. ప్రస్తుతం ఢిల్లీపై విదర్భ 233 పరుగుల ఆధిక్యం సాధించింది. ఇంక రెండు రోజుల ఆట మిగిలుండడంతో ఢిల్లీని ఓడించి రంజీ చరిత్రలో విదర్భ కొత్త చరిత్ర సృష్టిస్తుందో వేచి చుడాలి. ఆదివారం 206/4 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన విదర్భ కొద్ది వ్యవధిలోనే వాంఖడే (28), వఖరే (17) వికెట్లను చేజార్చుకుంది. అనంతరం వచ్చిన అక్షయ్, ఆదిత్యలు విదర్భ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ జట్టు స్కోరుబోర్డును ముందుకు సాగించారు. ఈ క్రమంలోనే కీలక ఇన్నింగ్స్ ఆడిన అక్షయ్ శతకం పూర్తి చేసుకున్నాడు. మరోవైపు సమన్యంతో ఆడుతున్న ఆదిత్య సారేతే కూడా అర్ధ శతకం సాధించాడు. అనంతరం ఇతను 154 బంతుల్లో 11 ఫోర్లతో 79 పరుగులు చేసి రాణ బౌలింగ్‌లో ఔటయ్యాడు. తర్వాత వచ్చిన సిద్ధేశ్ నరల్ కూడా దూకుడుగా ఆడుతూ అక్షయ్‌కు అండగా నిలిచాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వీరిద్దరూ అజేయంగా ఉన్నారు. వేగంగా ఆడిన సిద్ధేశ్ 92 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 56 పరుగులు చేశాడు. మరోవెపు అద్భుత ఇన్నింగ్స్ ఆడిన అక్షయ్ వాడ్కర్ 243 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్స్‌తో 133 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. దీంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 528 పరుగులు చేసింది. ఢిల్లీ బౌలర్లలో సాయిని మూడు, అకాశ్ రెండు వికెట్లు తీశారు.





2018 కోసం ఎదురుచూస్తున్నా

కేప్‌టౌన్ : అంతర్జాతీయ వన్డేలో మూడు డబుల్ సెంచరీలు బాదిన ఏకైక బ్యాట్స్‌మెన్‌గా చరిత్ర సృష్టించిన రోహిత్ శర్మ తన అభిమానులకు నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరిగే ద్వైపాక్షిక సిరీస్ కోసం కేప్‌టౌన్‌లో ఉన్న రోహిత్ అక్కడ ప్రాక్టీస్ అనంతరం దిగిన ఓ ఫోటోని ట్వీట్ చేశాడు. ''2017లో ట్రైనింగ్ తీసుకుంటున్న ఆఖరి రోజు. 2018కోసం ఆతృతతో ఎదురు చూస్తున్న'' అని రోహిత్ క్యాప్షన్ పెట్టాడు. ఈ ఏడాది శ్రీలంకతో జరిగిన టెస్ట్ సిరీస్ అనంతరం కెప్టెన్ విరాట్ కోహ్లీ విరామం తీసు కోవడంతో సారధ్య బాధ్యతలు స్వీకరించిన రోహిత్.. అటు కెప్టెన్‌గా, ఇటు బ్యాట్స్ మెన్‌గా అందరిని ఆకట్టుకున్నాడు.

యోయో! మళ్లీ కష్టమేనా!



ముంబై: యో-యో! ఈ ఏడాది భారత క్రికెట్‌లో హాట్ టాపిక్‌గా మారిన ఫిట్‌నెస్ పరీక్ష. టీమిండియా ప్రపంచకప్ హీరో యువరాజ్‌సింగ్‌ను జట్టులోకి ఎంపిక చేయకపోవడానికి కారణం ఇదే అని సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ చెప్పడంతో ఈ సంగతి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అశ్విన్, యువీ, రైనా వంటి సీనియర్లు తొలుత విఫలమైనా తర్వాత పరీక్ష పాసయ్యారు. ప్రస్తుతం 16.1గా ఉన్న టీమిండియా యోయో బెంచ్‌మార్క్‌ను ఇంకా పెంచబోతున్నారని సమాచారం. జట్టు ఫిట్‌నెస్ ప్రమాణాలను మరింత పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకోనున్నారట. బెంచ్‌మార్క్‌ను 16.5 లేదా 17కు పెంచాలని యోచిస్తున్నారు. 'యోయో ఫిట్‌నెస్ బెంచ్‌మార్క్ పెంచడంపై చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుత మార్క్‌ను దాటి 16.5 లేదా అంతకుమించి పెంచాలని ఆలోచిస్తున్నారు. అన్ని విభాగాల్లోనూ టీమిండియా మెరుగ్గా ఉండాలి. అందులో ఫిట్‌నెస్‌కు మినహాయింపేమీ లేదు. తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. టీమిండియా మాజీ కోచ్ అనిల్ కుంబ్లే యోయో ఫిట్‌నెస్ పరీక్షను తప్పనిసరి చేశారు. ప్రపంచంలోని ఆయా జట్లు వేర్వేరుగా బెంచ్‌మార్క్‌ను నిర?యించుకున్నాయి. పొరుగుదేశం పాక్‌లో ఇది 17.4 కాగా న్యూజిలాండ్‌లో 20.1గా ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail Address manamtelugudaily1@gmail.com, Web Edition www.manamnews.com